మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 14-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 315 Issue: 315

14 మే 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:48 సూర్యాస్తమయం - సా. 6:36 తిథి ద్వాదశి ఉ. 11:16 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం రేవతి రా. 10:34 వరకు తరువాత అశ్విని యోగం ప్రీతి సా. 5:47 వరకు కరణం తైతుల ఉ. 11:16 వరకు గరజి రా. 9:55 వరకు వర్జ్యం ఉ. 11:25 నుండి మ. 12:54 వరకు దుర్ముహూర్తం ఉ. 10:04 నుండి ఉ. 10:55 వరకు మ. 3:11 నుండి సా. 4:02 వరకు రాహుకాలం మ. 1:48 నుండి మ. 3:24 వరకు యమగండం తె. 5:48 నుండి ఉ. 7:24 వరకు గుళికాకాలం ఉ. 9:00 నుండి ఉ. 10:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:12 నుండి తె. 5:00 వరకు అమృత ఘడియలు రా. 8:19 నుండి రా. 9:48 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:38 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## బంగారానికీ వడ్డీ!

### కొత్తం గోల్డ్ మానిటైజేషన్ పాలసీ.. డిపాజిట్ చేస్తే ఏటా 2% వడ్డీరేటు

పసిడి ప్రియులకు కేంద్రం శుభవార్త చెప్పబోతున్నట్లు సమాచారం. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా త్వరలో కేంద్రం కొత్త 'గోల్డ్ మానిటైజేషన్' పాలసీని అందుబాటులోకి తేనుంది. తద్వారా ఇంట్లో ఉన్న బంగారంతో వడ్డీ వచ్చేలా ప్రతిపాదించనుంది.

న్యూఢిల్లీ: వినియోగదారులు వారి వద్ద ఉన్న కనీసం 10 గ్రాముల బంగారం ఉంటే బ్యాంకులో డిపాజిట్ చేయొచ్చు. డిపాజిట్ చేసిన బంగారంపై వార్షిక వడ్డీ రేటు సుమారు 2శాతం నుంచి -2 వ పేజీలో...



## బంగారం పిరం!

### దిగుమతి సుంకం రెట్టింపు.. నిన్నటి నుంచే అమల్లోకి

న్యూఢిల్లీ: బంగారం, వెండి విషయంలో కేంద్రం షాకిచ్చింది. దిగుమతి సుంకాన్ని రెట్టింపు చేస్తూ నిర్ణయం తీసుకుంది. బుధవారం అర్ధరాత్రి నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. ఈ నిర్ణయం వల్ల బంగారం, వెండి, ప్లాటినం.. ఇతర విలువైన లోహాల ధరలు భారీగా పెరగనున్నాయి. భారత్ ప్రపంచంలో చైనా తర్వాత రెండవ అతిపెద్ద బంగారం దిగుమతిదారుగా ఉంది. ప్రస్తుతం దిగుమతి సుంకం 6 శాతంగా తరువాయి 2 వ పేజీలో...



## రిటైర్మెంట్ ఫండ్స్ ఆటో విత్‌డ్రా

### త్వరలో ఫైనల్ సెటిల్‌మెంట్‌కు వర్తింపు.. ఉద్యోగులకు కేంద్రం గుడ్ న్యూస్

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ నగదు ఉపసంహరణ విధానాన్ని మరింత సులభతరం చేయబోతోంది. రిటైర్మెంట్ సమయంలో నిధుల ఉపసంహరణ ప్రక్రియను ఆటోమేట్ చేయనుంది. అంటే పదవీ విరమణ చేసిన కొద్ది రోజులకు సంబంధిత వ్యక్తి బ్యాంకు ఖాతాలోకి ప్రావిడెంట్ ఫండ్ మొత్తాలు జమయ్యేలా చర్యలు తీసుకోబోతోందని ఈపీఎఫ్‌వో ఉన్నత స్థాయి వర్గాలు వెల్లడించాయి.

న్యూఢిల్లీ: ఈపీఎఫ్‌కు సంబంధించి ప్రస్తుతం పాక్షిక లేదా అడ్వాన్స్ నగదు ఉపసంహరణల విషయంలో రూ.5 లక్షల వరకు ఆటో సెటిల్‌మెంట్ విధానం అమలౌతోంది. క్లెయిమ్ చేసిన సుమారు మూడు రోజుల్లో నిధులు బ్యాంకు ఖాతాల్లో జమవుతున్నాయి. దీన్ని రిటైర్మెంట్ విషయంలోనూ వర్తింపజేయాలని ఈపీఎఫ్ఓ నిర్ణయించింది. లేబర్ కోడ్‌ల అంశంపై అసోచామ్ నిర్వహించిన సెమినార్‌లో సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ రమేశ్ కృష్ణమూర్తి

# మెరవాలి.. మురవాలి

### రాబోయే 25 ఏళ్లకు సరిపోయేలా ప్రతి ప్రాజెక్టు



- వరంగల్, ఖమ్మం, కరీంనగర్‌కు ఓఆర్ఆర్
- రవాణాకు ఎలక్ట్రిక్ వాహనాలే వాడాలి
- టెంపుల్, టూరిజం కారిడార్లు పెరగాలి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

"రాబోయే 25 ఏళ్లకు సరిపోయేలా ప్రతి ప్రాజెక్టును డిజైన్ చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్మార్ట్ పోల్స్, రోడ్లు, ఎస్టీపీలు, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, ఈవీ వంటి అంశాలపై ప్రతి చోట ఒకే విధమైన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ కారిడార్ తెలంగాణకు అత్యంత కీలకంగా మారనుందని, ఈ మూడు కార్పొరేషన్లకు ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. పెద్ద మున్సిపాలిటీలకు సమీపంలో రేడియల్ రోడ్లు ఉండేలా డిజైన్ సిద్ధం చేయాలని ఆదేశించారు."

హైదరాబాద్, మే 13 (ఈవార్తలు): మున్సిపల్ శాఖ అధికారులతో 'పట్టణ కేంద్రాల ఆధారిత మెగా గ్రోత్ కారిడార్' పై ఎంసీహెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో బుధవారం సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి పరిధిలో ఉన్న అన్ని మున్సిపాలిటీలను ఒక యూనిట్‌గా పరిగణించాలని సూచించారు. సింగరేణి సంస్థకు చెందిన సీఎస్ఆర్ నిధులను స్థానికంగానే ఖర్చు చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో రాబోయే ఎయిర్ పోర్టులను దృష్టిలో ఉంచుకుని రోడ్ల నిర్మాణం చేపట్టాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణంలో అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే, ఖర్చు తగ్గించుకోవడానికి ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టాలని, లీజుకు తీసుకునే వాహనాలు -2 వ పేజీలో...



## క్లచ్ లేకుండానే గేర్ మార్చే బైక్

### హోండా ఎన్ఎక్స్ 500 లాంచ్

**ఎక్స్ షోరూం ధర రూ.7,43,900**

గురుగ్రామ్: హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తన పాపులర్ అడ్వెంచర్ టూరర్ మోడల్ 'ఎన్ఎక్స్500'ను సరికొత్త ఈ-క్లచ్ టెక్నాలజీతో మార్కెట్లోకి విడుదల చేసింది. క్లచ్‌తో పనిలేకుండా గేర్లు మార్చుకునే వెసులుబాటు కల్పించే ఈ టెక్నాలజీ బైక్ రైడింగ్ అనుభవాన్ని సరికొత్తగా మార్చనుం ది. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఈ ఆటోమేషన్ సాంకేతికతను భారత రైడింగ్ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించారు. దీని ధరను కంపెనీ రూ. 7,43,900 (ఎక్స్‌షోరూ మ్)గా నిర్ణయించింది. ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉన్న హోండా బిగ్‌వింగ్ డీలర్‌షిప్‌లలో బుకింగ్స్ ప్రారంభమ య్యాయి. ఇందులో-2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,200 |
| వెండి (కిలో): | రూ.3,20,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,469 |

## విశ్వవాణి



డెన్మార్క్‌లో ప్రతి కాలేజీ స్టూడెంట్‌కు అక్కడి ప్రభుత్వం ప్రతి నెలా వెయ్యి డాలర్లను అందజేస్తుంది. ఉచిత విద్య అందించే చర్యల్లో భాగంగా విద్యార్థులకు గొప్ప పథకాన్ని అమలు చేస్తోంది.

## నీట్ పేపర్ రేటు 15 లక్షలు



- రూ.10 లక్షలకు కొన్న నాసిక్ విద్యార్థి
- రూ.15 లక్షలకు అమ్మినట్లు వెలుగులోకి
- పరీక్షకు రెండు రోజుల ముందు పేపర్ లీక్

ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలతో యూజీ నీట్ 2026ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం రద్దుచేసింది. ఈ ప్రభావం 22 లక్షల మంది విద్యార్థులపై పడింది. ఈ కుంభకోణం మహారాష్ట్రలోని నాసిక్‌లో ప్రారంభమైంది. అక్కడ పేపర్ మొదటి డిజిటల్ కాపీ బయటపడింది. నివేదికల ప్రకారం.. పుణేకు చెందిన అనుమానితుడి నుంచి లీక్ అయిన పేపర్‌ను కొనుగోలు చేసి, ఆపై దానిని రూ. 5 లక్షల లాభంతో విక్రయించాడనే ఆరోపణలపై నాసిక్‌కు చెందిన శుభమ్ ఖైర్నార్‌ను సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అదుపులోకి తీసుకుంది.

నాసిక్:మహారాష్ట్ర తర్వాత హర్యానాలోని గురుగ్రామ్, రాజస్థాన్‌లోని ప్రధాన కోచింగ్ సెంటర్ జైపూర్, సికార్ అలాగే జమ్మూ కశ్మీర్, బీహార్, కేరళతో సహా అనేక రాష్ట్రాలకు వ్యాపించింది. నాసిక్‌లోని ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల శుభమ్ ఖైర్నార్ బీఏఎంఎస్ విద్యార్థి. లీకైన నీట్- 2 వ పేజీలో...

## విజయ్..144

### అసెంబ్లీ బల పరీక్షల్లో నెగ్గిన టీవీకే.. 144 సీట్ల మెజార్టీతో సూపర్ సక్సెస్

ముఖ్యమంత్రిగా బాధ్యతల చేపట్టిన విజయ్.. బుధవారం అసెంబ్లీలో నిర్వహించిన బల పరీక్షలో ఘన విజయం సాధించారు. మొత్తం 144 మంది ఎమ్మెల్యేల మద్దతుతో విజయ్ సర్కార్ తన బలాన్ని నిరూపించుకుంది. ముఖ్యంగా బల పరీక్షకు సంబంధఇంచిన ఈరోజు ఉదయం విజయ్ సభలో తీర్మానం ప్రవేశ పెట్టగా.. దీనిపై చర్చ జరిగింది. ఆ తర్వాత స్పీకర్ ఓటింగ్ నిర్వహించారు. అయితే సాధారణ ఓటింగ్ మాదిరిగా కాకుండా.. ఒక్కో సభ్యుడిని పిలిచి మరీ ఎమ్మెల్యే సమ్మతిని స్పీకర్ నమోదు చేసుకున్నారు.



చెన్నై: బలపరీక్షకు ముందే అధికార డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి విజయ్‌కు వ్యతిరేకంగా జరిగే ఈ ఓటింగ్‌లో తమ పార్టీ పాల్గొనడం లేదని డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ అసెంబ్లీలో స్పష్టం చేశారు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీయే లేదని.. తమ కూటమి మద్దతు వల్లే ఆయన - 2 వ పేజీలో...

## పెట్రో బాంబ్ తప్పదు!

- ప్రపంచంలో క్రూడాయిల్ సంక్షోభం
- పరిస్థితి ఇలాగే కొనసాగితే రేట్ల పెంపు తప్పదు
- ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



దేశంలో పెట్రో ధరల పెంపుపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. మిడిల్ ఈస్ట్ వార్, క్రూడాయిల్ ధరల పెరుగుదల కారణంగా దేశంలో పెట్రో ధరలు క్రమంగా పెరిగే అవకాశం ఉందన్నారు.

న్యూఢిల్లీ: ఈ సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయని, ద్రవ్యోల్బణం, చమురు దిగుమతులపై ప్రభావం తప్పదని అభిప్రాయపడ్డారు. స్విట్జర్లాండ్‌లో జరిగిన స్విస్ నేషనల్ బ్యాంక్ అండ్ ద ఇంటర్నేషనల్ మానెటరీ ఫండ్ సదస్సులో సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా చమురు ధరల పెరుగుదల ప్రభావం నుంచి ప్రభుత్వం ప్రజల్ని నిరంతరం రక్షించలేదన్నారు. నిరంతరం ధరల పెరుగుదల కొనసాగితే, ప్రభుత్వం దేశంలో పెట్రో ధరలు - 2 వ పేజీలో...



## అమూల్ పాలు రూ.2 పెంపు

### నేటి నుంచే అమలులోకి

హైదరాబాద్, మే 13 (ఈవార్తలు): దేశంలోని దిగ్గజ పాల ఉత్పత్తి సంస్థల్లో ఒకటైన అమూల్ మరోసారి ధరల పెంపు నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా తమ పాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. లీటర్ పాల ధరను రూ.2 మేర పెంచుతూ ఆ సంస్థ నిర్ణయం - 2 వ పేజీలో...

## భారత్‌కు మేమున్నాం

### ఇంధర సరఫరాలో లోటు రానివ్వం.. ఇంధన సరఫరాపై రష్యా భరోసా



పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలతో భారత్ సహా ప్రపంచ దేశాలు ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌కు మిత్రదేశం రష్యా శుభవార్త చెప్పింది. ఇంధన సరఫరాలకు సంబంధించి భారత్‌తో అన్ని ఒప్పందాలను నెరవేర్చుతామని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ప్రకటించారు.

మాస్కో: ఇరుదేశాల మధ్య సంబంధాలు స్నేహంపై ఆధారపడి ఉన్నాయన్న ఆయన.. తమ దారులు వేరయ్యే పరిస్థితి తలెత్తదని చెప్పారు. త్వరలోనే న్యూఢిల్లీ పర్యటనకు రానున్న సెర్గీ లావ్రోవ్.. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. భారత్, రష్యా సంబంధాల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. ప్రపంచం చూసిన శక్తిమంతమైన నాయకుల్లో మోదీ ఒకరని కొనియాడారు. ఆర్థిక వ్యవస్థ, సైన్యం, సంస్కృతి - 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

14.5.2026

మేషం: సంతానం నుండి శుభవార్తలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

వృషభం: కుటుంబ వ్యవహారాలలో స్థిరమైన ఆలోచనలు చేసి మీ విలువ పెంచుకుంటారు. బంధుమిత్రులతో వివాదాలు ఓ కొలిక్కి వస్తాయి. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో ఆశించిన అభివృద్ధి కలుగుతుంది. దూర ప్రయాణాలు లాభిస్తాయి. వ్యాపారాలలో లాభాలు అందుకుంటారు.

మిధునం: నిరుద్యోగ యత్నాలు కలిసిరావు. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. బంధు మిత్రులతో ధన వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండడం మంచిది. గృహనిర్మాణ ప్రయత్నాలు త్వరితగతిన పూర్తి కావు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి.

కర్కాటకం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. గృహమున కొందరి ప్రవర్తన ఇబ్బంది కలిగిస్తుంది. వృత్తి,ఉద్యోగాలలో నూతన ప్రోత్సహకాలు అందుకుంటారు. స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభిస్తాయి. ఇతరుల నుండి అవసరానికి సహాయం అందుతుంది.

సింహం: కుటుంబ సభ్యుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు తొలగుతాయి. గృహమున బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. సంతాన విద్యా విషయంలో శుభవార్తలు అందుతాయి. వృత్తి ఉద్యోగమున అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది.

కన్య: జీవిత భాగస్వామితో మనస్పర్ధలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో కొందరి ప్రవర్తన చికాకు కలిగిస్తుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. గృహంలో చికాకులు పెరుగుతాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలు మరింత ఇబ్బంది కలిగిస్తాయి.

తుల: వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోకపోవడం వలన నష్టపడతారు. నూతన ఋణ ప్రయత్నాలు ఫలిస్తాయి. దూర ప్రయాణాలు చేస్తారు. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. ఉద్యోగాలలో అధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

వృశ్చికం: ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. సోదరుల సహాయంతో వివాదాల నుండి బయట పడతారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగస్థులకు పదోన్నతులు పెరుగుతాయి. బంధుమిత్రుల ఆగమనం సంతోషం కలిగిస్తుంది.

ధనస్సు: కుటుంబ వ్యవహారాలలో సొంత నిర్ణయాలు తీసుకోరాదు. ఇంటా బయట కొందరి ప్రవర్తన ఆందోళన కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆలయ సందర్శన చేసుకుంటారు. ఉద్యోగమున అధికారులతో అప్రమత్తంగా ఉండాలి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి.

మకరం: ఉద్యోగాలలో ఉత్సాహకర వాతావరణం ఉంటుంది. ఆర్థికంగా పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. స్థిరమైన ఆలోచనలు చేసి లాభపడతారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వ్యాపారాలలో లాభాలు అందుకుంటారు.

కుంభం: చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభించదు. ముఖ్యమైన పత్రాల విషయంలో జాగ్రత్త వహించాలి. వృత్తి వ్యాపారాలలో ఆశించిన ఫలితాలు రావు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఋణ ప్రయత్నాలు కలిసిరావు.

మీనం: గృహమున బంధు మిత్రుల రాక ఆనందం కలిగిస్తుంది. చిన్ననాటి మిత్రులతో సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆకస్మిక ధన ప్రాప్తి కలుగుతుంది. ఉద్యోగమున అనుకూలత పెరుగుతుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

# నీట్ పేపర్ రేటు 15 లక్షలు

**మొదటి పేజీ తరువాయి**

పేపర్‌ను పుణేకు చెందిన అనుమానితుడి నుంచి రూ.10 లక్షలకు కొనుగోలు చేసి హర్యానాలోని ఓ వ్యక్తికి రూ.15 లక్షలకు విక్రయించి రూ.5 లక్షల లాభం పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ అప్లికేషన్ ద్వారా పేపర్ సర్క్యులేట్ అయిందని నివేదికలు చెబుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం శుభమ్‌ను సీబీఐ అదుపులోకి తీసుకుంది. తనను గుర్తించకుండా జుత్తు కత్తిరించి తన రూపురేఖలను మార్చుకున్నాడని దర్యాప్తు అధికారులు తెలిపారు. అయితే, అధికారుల ముందు అతడి ప్రయత్నాలు ఫలించలేదు. సాంకేతికత సాయంతో అతడిని గుర్తించారు. అతడ్ని అదుపులోకి తీసుకున్న తరువాత... తండ్రి మధుకర్ ఖైర్నార్ తన కొడుకుపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొన్నారు. పేపర్ లీక్ రాకెట్‌తో శుభమ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన తెలిపారు. కానీ, నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు నిష్పక్షపాతంగా, సమగ్రంగా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పేపర్ లీక్‌లో పోర్టబుల్ స్కానర్‌లు, క్లిష్టమైన టెలిగ్రామ్ నెట్‌వర్క్, షాడో సర్వర్‌లతో సహా అధునాతన సాంకేతికతలను ఉపయోగించినట్టు నివేదికలు పేర్కొన్నాయి. నివేదికల ప్రకారం, పరీక్షకు దాదాపు 45 గంటల ముందు పేపర్ సర్క్యులేట్ అయ్యింది. కేరళలో చదువుతున్న సికార్ విద్యార్థి హాస్టల్ నడుపుతున్న తన తండ్రికి "గెస్ పేపర్" పీడీఎఫ్ పంపినట్లు ఆరోపణలు రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పరీక్ష రోజు ఉదయం హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు పేపర్ ఇచ్చేందుకు ప్రయత్నించగా.. వారు అప్పటికే సెంటర్లకు వెళ్లిపోయారని సమాచారం. పరీక్ష ముగిసిన తర్వాత, పేపర్‌ను కెమిస్ట్రీ, బయాలజీ లెక్చర్లకు చూపించడంతో 108 కెమిస్ట్రీ ప్రశ్నలకు 45, 204 బయాలజీ ప్రశ్నలకు 90 అసలు పరీక్ష పేపర్‌తో సరిపోలింది. సికార్‌లోని కొన్ని కోచింగ్ కేంద్రాలు గెస్ పేపర్స్ ఉపయోగించి నీట్‌కు సిద్ధం కావాలని కోరినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. కొందరికి పీడీఎఫ్ కాపీలు అందగా, మరికొందరికి లీకైన పేపర్‌కి సంబంధించిన అసలు కాపీలు ఇచ్చినట్లు సమాచారం. ఫిర్యాదు చేయడానికి ఉపాధ్యాయులు ప్రయత్నించినా.. సికర్ పోలీసులు కేసు నమోదు చేయడానికి నిరాకరించారు. దీంతో వారు నేరుగా



ఎన్‌టీఏకి మెయిల్ పంపడంతో ఇంటెలిజెన్స్ బ్యూరోకి సమాచారం అందించింది. చివరకు రాజస్థాన్ పోలీసులు రంగంలోకి దిగి, దర్యాప్తు చేపట్టడంతో గుట్టు బయటపడింది.

# మెరవాలి.. మురవాలి

**మొదటి పేజీ తరువాయి**

కూడా ఈవీలే అయి ఉండాలని ఆదేశించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్లు, సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లతో కూడిన అర్బన్ ప్లానింగ్ ఉండాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో సోలార్ ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, పట్టణాలు, నగరాల్లో రేడియేషన్ తగ్గించడానికి మల్టీ యుటిలిటీ టవర్లను నిర్మించాలని సూచించారు. ప్రతి చోట స్మార్ట్ పోల్స్ ఉండాలని, ఆయా నగరాల జనాభాకు తగినట్లుగా స్థానికంగా డిజైన్ చేసుకోవాలని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై నిపుణుల సలహాలు తీసుకోవాలన్నారు. సీవరేజ్ అండ్ వేస్ట్ వాటర్ మేనేజ్మెంట్ బోర్డు నుంచి శుద్ధి చేసిన నీటినే భవన నిర్మాణాల్లో వాడేలా కఠిన నిబంధనలు తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో ప్రత్యేక కారిడార్లను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. వరంగల్ - కరీంనగర్ - ఖమ్మం కారిడార్ భవిష్యత్ తెలంగాణకు వెన్నెముకగా మారుతుందని ఆయన



అభిప్రాయపడ్డారు. నల్గొండ - యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్, ఆదిలాబాద్ - నాగోబా - బాసర - కడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్ ఏర్పాటు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని అలంపూర్ జోగులాంబ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని, మహబూబ్ నగర్ - భూత్పూర్ - జడ్చర్ల ప్రాంతాలను కలిపి ఒక కారిడార్‌గా, కొత్తగూడెం - పాల్వంచ - సుజాతనగర్ కలిపి మరో కారిడార్‌గా రూపొందించాలని సూచించారు. ఎయిర్ పోర్టుల రాకతో వరంగల్ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయని సీఎం అన్నారు. వరంగల్ ఎయిర్ పోర్టుకు అవసరమైన నీటి అవసరాలను ఇప్పుడే అంచనా వేయాలన్నారు. ఆదిలాబాద్ ఎయిర్ పోర్టును డిఫెన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, మున్సిపల్ శాఖ కార్యదర్శి డాక్టర్ టీకే శ్రీదేవి, డీటీసీపీ డైరెక్టర్ ఎస్. దేవేందర్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ విభాగం ఈఎన్సీ ఎస్. భాస్కర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.



## బంగారానికీ వడ్డీ!

**మొదటి పేజీ తరువాయి**

2.5శాతం వరకు పొందవచ్చు. భారతీయుల వద్ద సుమారు 30,000 టన్నుల బంగారం నిల్వగా ఉందని అంచనా. దీన్ని వెలికితీసేందుకు ప్రధాని మోదీ సర్కార్ మాస్టర్ ప్లాన్ వేసింది. రూపాయి విలువను బలోపేతం చేయడానికి బంగారం దిగుమతులను తగ్గించే ప్రయత్నాల్లో ప్రభుత్వం ఉందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. మోదీ ప్రభుత్వం తీసుకురానున్న ఈ గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్‌లో డిపాజిట్ చేసిన బంగారంపై వడ్డీతో పాటు పన్ను మినహాయింపులు పొందే అవకాశం ఉంటుంది. సుమారు 2,000 టన్నుల బంగారం డిపాజిట్ అయితే, మూడేళ్ల వరకు దిగుమతుల అవసరం ఉండదని అంచనా. గోల్డ్ పాలసీలో కీలక మార్పులకు ఆర్థిక శాఖ సిద్ధమవుతోంది. ఈ కొత్త గోల్డ్ మానిటైజేషన్ పాలసీపై కేంద్ర ఆర్థిక శాఖ త్వరలో స్పష్టత ఇవ్వనుంది.

## బంగారం పిరం!

**మొదటి పేజీ తరువాయి**

ఉంది. అయితే తాజా నిర్ణయంతో దాన్ని 16 శాతానికి పెంచింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో దేశ విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను బంగారం కొనుగోళ్లను కొంతకాలం వాయిదా వేసుకోవాలని కోరారు. ముఖ్యంగా వివాహాలు, పండుగల కోసం ఏడాది పాటు బంగారం కొనకుండా ఉంటే విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. దీంతో ఆందోళన వ్యక్తమైంది. ప్రస్తుతం బంగారం ధర రూ. 1,53,990 ఉంది. కిలో వెండి ధర రూ.3 లక్షలుగా ఉంది. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఈ ధరలు పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. రెవెన్యూ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, బంగారం, వెండి, ప్లాటినంతో పాటు ఆభరణాల తయారీలో ఉపయోగించే హుక్స్, క్లాప్స్, క్లాంప్స్, పిన్లు, స్క్రూ బ్యాక్స్ వంటి వాటిపైనా సుంకాలు పెరిగాయి. బంగారం, వెండి ఫైండింగ్స్‌పై 5% కస్టమ్స్ సుంకం, ప్లాటినం ఫైండింగ్స్‌పై 5.4% సుంకం విధించారు. అదే సమయంలో, రీసైక్లింగ్, విలువైన లోహాల రికవరీకి ప్రోత్సాహం ఇవ్వడానికి ఉపయోగించిన ఉత్ప్రేరకాలు, బూడిదతో కూడిన విలువైన లోహాల దిగుమతులపై సుంకాన్ని 4.35%కి తగ్గించారు. అయితే ఇందుకు నిర్దిష్ట నిబంధనలు, అనుమతులు తప్పనిసరిగా పాటించాలి.

## రిటైర్మెంట్ ఫండ్స్ ఆటో విత్‌డ్రా

**మొదటి పేజీ తరువాయి**

త్వరలో ఫైనల్ సెటిల్‌మెంట్‌కు వర్తింపు.. ఉద్యోగులకు కేంద్రం గుడ్ న్యూస్ ఈ విషయం వెల్లడించారు. ఇప్పటివరకు అడ్వాన్సులకు మాత్రమే పరిమితమైన ఆటో విత్‌డ్రా సదుపాయాన్ని ఫైనల్ సెటిల్‌మెంట్‌కు కూడా త్వరలో వర్తింపజేయనున్నట్లు కృష్ణమూర్తి వెల్లడించారు. అలాగే, ఉద్యోగి ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మారేటప్పుడు పీఎఫ్ ఖాతాల ఆటో ట్రాన్స్‌ఫర్ సదుపాయాన్నీ తీసుకురాబోతున్నట్లు చెప్పారు. ఇకపై మాన్యువల్‌గా ఏమీ చేయక్కర్లేదని తెలిపారు. కొత్త లేబర్ కోడ్‌లకు అనుగుణంగా ఈపీఎఫ్ స్కీమ్ 1952, డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ 1976, ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్ 1995కు సంబంధించిన నిబంధనలనూ త్వరలో రీనోటిఫై చేయనున్నట్లు వివరించారు.

## పెట్రో బాంబ్ తప్పదు!

**మొదటి పేజీ తరువాయి**

పెంచుతూ నిర్ణయం తీసుకునేందుకు ఎంతో సమయం పట్టదన్నారు. ఇప్పటికే చమురు ధరల్ని నియంత్రించేందుకు ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాల్ని తగ్గించిందని గుర్తు చేశారు. ఆయిల్ కంపెనీల నష్టాలను ప్రభుత్వం భరిస్తూ వస్తోందని, ధరల్ని అదుపులో ఉంచుతోందని వెల్లడించారు. అయితే, ప్రభుత్వం ఎంతకాలం ఈ పని చేయగలదనేది సందేహమన్నారు. దేశానికి చమురు అందించే హోర్ముజ్ జలసంధిని ఇరాన్, అమెరికా మూసేసిన నేపథ్యంలో చమురు రవాణా జరగకుండా, సంక్షోభం తలెత్తింది. మరోవైపు దేశంలో చమురును పొదుపుగా వాడాలని ప్రధాని మోదీ ఇటీవల ప్రజలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## క్లచ్ లేకుండానే గేర్ మార్చే బైక్

**మొదటి పేజీ తరువాయి**

471 సీసీ, లిక్విడ్-కూల్డ్, ప్యారలల్--ట్విన్ ఇంజిన్‌ను 6--స్పీడ్ ట్రాన్స్‌మిషన్‌తో అమర్చారు. ఇది సిటీ రైడింగ్ హైవే టూరింగ్ రెండింటికీ అనువైన బలమైన టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఫీచర్ల విషయానికొస్తే... 5.0 అంగుళాల పూర్తి రంగుల టీఎఫ్‌టీ (టీఎఫ్ టీ) డిస్‌ప్లే ఉంది. ఇందులో నావిగేషన్, కాల్, మ్యూజిక్ ఫంక్షన్ల కోసం హోండా రోడ్‌సింక్ కనెక్టివిటీ లభిస్తుంది. భద్రత కోసం డ్యూయల్ ఛానల్ ఏబీఎస్, హోండా సెలెక్టబుల్ టార్క్ కంట్రోల్, పూర్తి ఎల్ఈడీ లైటింగ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ బైక్ మ్యాట్ గన్‌పౌడర్ బ్లాక్ మెటాలిక్, పెర్ల్ హొరిజోన్ వైట్ అనే రెండు ఆకర్షణీయమైన రంగుల్లో లభిస్తుంది. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ఐ అధ్యక్షుడు, సీఈఓ సుత్సుము ఒటాని మాట్లాడుతూ, ఈ-క్లచ్ సాంకేతికత పట్టణ, పర్యటన వాతావరణాలలో రైడర్ అలసటను తగ్గించి, కంట్రోల్‌ను పెంచుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## అమూల్ పాలురూ.2 పెంపు

**మొదటి పేజీ తరువాయి**




తీసుకుంది. పెంచిన ధరలు మే 14వ తేదీ నుంచే అమలులోకి రానున్నాయి. ఇప్పటికే దేశంలో ఇంధన కొరత కారణంగా నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఇప్పుడు పాల ధరలు సైతం పెరగడంతో వంటింటి ఖర్చు తడిసి మోపెడు కానుంది. అమూల్ ఏయే పాల ధరలను పెంచుతుందో తెలుసుకుందాం. అమూల్ సంస్థ మే 14వ తేదీ నుంచి అమల్లోకి వచ్చేలా వివిధ రకాల పాల ధరలను లీటరుకు రూ.2 పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ పెంపు అమూల్ స్టాండర్డ్ మిల్క్, గోల్డ్, తాజా, ఆవు పాలు, గేదె పాలు, స్లిమ్ అండ్ ట్రిమ్, టి-స్పెషల్ వంటి జనాదరణ పొందిన ఉత్పత్తులపై ప్రభావం చూపుతుంది. అయితే 500 మిల్లీలీటర్ల పాల ప్యాక్‌ల ధరను రూ.1 చొప్పున పెంచుతున్నట్లు తెలిపింది. పెరుగుతున్న ముడిసరుకు ఖర్చులను కారణంగా చూపుతూ అమూల్ బ్రాండ్ క్రింద పాలు, పాల ఉత్పత్తులను విక్రయించే గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. 'మే 14 నుంచి భారత దేశవ్యాప్తంగా ప్రధాన పాల విక్రయ రకాలు, ప్యాక్‌లలో తాజా పౌచ్ పాల ధరలను లీటరుకు రూ. 2 చొప్పున పెంచాము' అని తెలిపింది.

## భారత్‌కు మేమున్నాం

**మొదటి పేజీ తరువాయి**

సహా భారత్‌ను అన్ని రంగాల్లో సార్వభౌమాధికారం సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని వివరించారు. "ఇంధన సరఫరా బాధ్యతలను రష్యా ఎన్నడూ విస్మరించలేదు.. ఈ విషయంలో భారత ప్రయోజనాలకు ఎటువంటి ఇబ్బందులు కలగనివ్వం.. ఆయిల్ సరఫరాలో ఆటంకం ఏర్పడనివ్వం... ఇరుదేశాల మధ్య ఒప్పందాలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటాం.. కుడంకుళం న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌లో కొత్త యూనిట్ల నిర్మాణంలో భారత్‌కు మా సహకారం కొనసాగుతోంది. ఆ దేశ అవసరాల దృష్ట్యా చమురు, సహజవాయువు, బొగ్గు వంటివి సరఫరా చేస్తూనే ఉంటాం.. భారత్- రష్యా బంధాన్ని బలహీనపరిచేందుకు కొందరు చేస్తున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి. భారతీయులు- రష్యన్లు సోదరులు అనేది సరదా నినాదం మాత్రమే కాదు... మన సంస్కృతిలో అది ఓ భాగం.. బాలీవుడ్ సినిమాలు, రాజ్ కపూర్, భారత్ టెలివిజన్ సిరీస్‌లు రష్యాలోనూ ప్రజాదరణ పొందాయి. ఆర్థిక, సైనిక సహకారం, ఇంధన సరఫరా, సాంస్కృతిక మానవతా సంబంధాల వంటి అనేక అంశాల్లో ఇరుదేశాల మధ్య సంబంధాలు దృఢంగా ఉన్నాయి" అని రష్యా విదేశాంగ మంత్రి అన్నారు.

# విజయ్.. 144

**మొదటి పేజీ తరువాయి**

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగారని చెప్పారు. మెజార్టీ సాధించేందుకు విజయ్ ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారని కూడా ఆరోపించారు. దీని వల్ల రాష్ట్రం పరువు పోతుందంటూ.. డీఎంకేకు చెందిన 59 మంది ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. దీంతో సభ మొత్తం బలం 233 నుంచి గణనీయంగా తగ్గింది. ఇది పరోక్షంగా విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మెజారిటీ మార్కును సులభతరం చేసింది. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే ఈ బలపరీక్షను తీవ్రంగా వ్యతిరేకించింది. ముఖ్యంగా పళని స్వామి మాట్లాడుతూ.. తమ ఎమ్మెల్యేలకు విజయ్ డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. ఇది సరైన పద్ధతి కాదంటూనే.. తమ పార్టీ ఎమ్మెల్యేలు అందరూ విజయ్‌కు వ్యతిరేకంగానే ఓటు వేస్తారని ఆ పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. మరోవైపు అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలు దీనిపై స్పందిస్తూ.. తమకెవరూ డబ్బులు ఆఫర్ చేయలేదని, మనస్ఫూర్తిగానే విజయ్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకించారు. గత నెలలో జరిగిన ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 స్థానాల్లో విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవసరమైన 118 స్థానాలకు 10 సీట్ల దూరంలో నిలిచిపోయింది. దీంతో కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే మద్దతుతో తమిళనాడులో తొలి సారిగా ఒక ప్రత్యేక కూటమి ప్రభుత్వం ఏర్పడింది. మొత్తంగా 120 మంది ఎమ్మెల్యేల మద్దతుతో.. సీఎం అయ్యారు. కానీ తాజాగా ఒకే ఒక్క ఓటుతో గెలిచిన శ్రీనివాస సేతుపతి బల పరీక్షలో పాల్గొనకూడదని మద్రాస్ హైకోర్టు తీర్పునిచ్చింది. ఇలా మంగళవారంకు టీవీకేకు 119 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉండగా.. ఉత్కంఠ నెలకొంది. కానీ డీఎంకే వాకౌట్‌తో ఈరోజు సభా బలం తగ్గిపోయింది. ఇలా బల పరీక్షలో 144 మంది ఎమ్మెల్యేల అండతో విజయ్ తన ప్రభుత్వాన్ని సుస్థిరం చేసుకున్నారు.



# ఎండ దెబ్బకు బేజారే!



## ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 వరకు బయటికి రావొద్దు

## ప్రజలకు మంత్రి పొంగులేటి హెచ్చరికలు

హైదరాబాద్, మే 13 (ఈవార్తలు): తెలంగాణలో భానుడి భగభగలు పెరిగిపోతున్నాయి. ఉదయం 8 గంటల తర్వాత ఇంటి నుంచి బయటికి రావాలంటేనే జనాలు జంకుతున్నారు. భారీగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో.. వడదెబ్బ తగలడం, అస్వస్థతకు గురికావడం వంటి సంఘటనలు పెరిగిపోతున్నాయి. మరోవైపు.. ఎండలు మండిపోతుండటంతో.. జనాలు ఇళ్ల నుంచి బయటికి కాలు పెట్టలేకపోతున్నారు. ఈ క్రమంలోనే రాబోయే రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని.. వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయింది. ఎండల పట్ల రాష్ట్ర ప్రజలు అలర్ట్‌గా ఉండాలని తెలంగాణ రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తాజాగా కీలక సూచనలు చేశారు.



అత్యవసరం అయితే తప్ప.. ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇళ్ల నుంచి ప్రజలు బయటికి రావద్దని మంత్రి పొంగులేటి సూచించారు. కొన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తెలిపారు. ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో తీవ్రమైన వడగాలుల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో కూడా వేడి గాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. తీవ్రమైన వడగాలులతో పాటు.. ఉరుములు, మెరుపులతో కూడిన ఆకస్మిక వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి.. ప్రజలకు సూచనలు చేయాలని ఆదేశించారు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున తాగునీటికి ఎక్కడా కొరత లేకుండా.. వడదెబ్బ మరణాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లతోపాటు.. అవసరమైన మందులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్న జిల్లాల్లో అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# తెలంగాణలో ఉబెర్ భారీ విస్తరణ

**సీఎం రేవంత్‌తో సీఈవో భేటీలో కీలక చర్చలు**

**సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణకు ఉబెర్ నిర్ణయం**

**పార్కింగ్ రంగంలోకి రావాలని రేవంత్ సూచన**



హైదరాబాద్, మే 13 (ఈవార్తలు): ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఉబెర్ తెలంగాణలో తమ కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు ఉబెర్ సీఈవో దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న సీఎం నివాసంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలో కంపెనీ విస్తరణ, నగరాల్లో పార్కింగ్ సమస్యలు, రాబోయే భారత్ ఫ్యూచర్ సిటీలో అవకాశాలపై కీలక చర్చలు జరిపారు. హైదరాబాద్‌లో తమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను విస్తరిస్తున్నట్లు ఈ సందర్భంగా సీఎంకు దారా ఖోస్రోషాహి తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన మొట్టమొదటి సీఓఈ ఇదేనని, ప్రస్తుతం ఇక్కడ 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని, భవిష్యత్తులో దీనిని మరింతగా పెంచనున్నామని వివరించారు. ఈ సందర్భంగా నగరాల్లో, ముఖ్యంగా మెట్రో స్టేషన్ల వద్ద ఎదురవుతున్న పార్కింగ్ ఇబ్బందులను సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ఈవీ ఛార్జింగ్ స్టేషన్లతో కూడిన మల్టీ-లెవల్ పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉబెర్‌కు సూచించారు. పట్టణ రద్దీని తగ్గించేందుకు పార్కింగ్ నిర్వహణ రంగంలోకి ప్రవేశించే అవకాశాలపై అధ్యయనం చేయాలని కోరారు. సీఎం ప్రతిపాదనపై ఉబెర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 30,000 ఎకరాల భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు గురించి సీఎం వారికి వివరించారు. ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుపై ఆసక్తి చూపిన దారా ఖోస్రోషాహి, అక్కడ తమ కార్పొరేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, తమ భవిష్యత్ విస్తరణకు ప్రభుత్వ సహకారం కావాలని కోరారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబెర్ ఇండియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, సీటీఓ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారం రోజుల భారత పర్యటనలో భాగంగా ఖోస్రోషాహి పలువురు కేంద్ర, రాష్ట్ర నాయకులతో మొబిలిటీ, టెక్నాలజీ, పెట్టుబడులపై చర్చిస్తున్నారు. కాగా, పార్కింగ్ ప్రాజెక్టులు, కొత్త కార్పొరేట్ ఆఫీస్ ఏర్పాటుకు సంబంధించి నిర్దిష్ట కాలపరిమితులను ప్రకటించనప్పటికీ, తెలంగాణలో పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఇరు పక్షాలు అంగీకరించాయి.

# నేపాలీ గ్యాంగ్ హల్‌చల్

**ప్రొఫెసర్ ఇంట్లో భారీ దోపిడీ.. 60 తులాల బంగారం, నగదు లూటీ**

హైదరాబాద్, మే 13 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో నేపాలీ ముఠాల నేరాలు మరోసారి కలకలం సృష్టించాయి. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌకూరు గల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో నివసిస్తున్న ప్రొఫెసర్ దంపతుల ఇంట్లో ఓ ముఠా భారీ దోపిడీకి పాల్పడింది. ఇంట్లో పని చేసేవారే పథకం ప్రకారం ఈ దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో దుండగులు సుమారు 60 తులాల బంగారం, వెండి వస్తువులు, రూ.30,000 నగదు దోచుకెళ్లారు. బాధితులు ప్రొఫెసర్ విజయలక్ష్మి, మురళీ మోహన్ 13 రోజుల క్రితమే నేపాల్‌కు చెందిన దంపతులను పనిలో పెట్టుకున్నారు. సోమవారం రాత్రి పనిమనిషి పుట్టినరోజు అని చెప్పి, కేక్ కటింగ్ ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు వారి స్నేహితులుగా మరో ఐదుగురిని ఇంటికి పిలిచారు. ప్రొఫెసర్ దంపతులు భోజనం చేస్తున్న సమయంలో ముఠా సభ్యులు ఒక్కసారిగా వారిపై దాడి చేసి, తాళ్లతో కట్టేశారు. "మీకు కావాల్సింది తీసుకెళ్లండి, మమ్మల్ని చంపకండి" అని బాధితులు వేడుకున్నా వినకుండా, వారికి మత్తుమందు ఇచ్చి ఓ గదిలో బంధించారు.






# జైలు కూడు కావాలంటే రూ.2,000

**హైదరాబాద్ జైల్లో ఒక రోజు గడిపే చాన్స్**

చంచల్‌గూడ, హైదరాబాద్ మే 13 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని చంచల్‌గూడ సెంట్రల్ జైలులో అధికారులు ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా సాధారణ పౌరులు కూడా జైలు జీవితాన్ని ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం కల్పిస్తున్నారు. ఖైదీల జీవనశైలి, వారు ఎదుర్కొనే పరిస్థితులు, స్వేచ్ఛ విలువ గురించి ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో భాగంగా 24 గంటల పాటు జైలులో గడపాలనుకునే వారు రూ. 2,000 చెల్లించాల్సి ఉంటుంది. 12 గంటల అనుభవం కోసం రూ. 1,000 ఫీజుగా నిర్ణయించారు. ఇందులో పాల్గొన్న వారికి ప్రత్యేకంగా రూపొందించిన జైలు గదులలో బస కల్పిస్తారు. ఖైదీలకు ఇచ్చే భోజనం అందించి, జైలు నిబంధనలు, ఖైదీల దినచర్యను పాటింపజేస్తారు. మంగళవారం చంచల్‌గూడలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్ఐసీఏ) ప్రాంగణంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. దీంతో పాటే కొత్తగా ఏర్పాటు చేసిన జైల్ మ్యూజియంను కూడా ఆయన ప్రారంభించడం విశేషం. ఈ మ్యూజియంలో నిజాం కాలం నాటి జైళ్ల నుంచి ఆధునిక సంస్కరణ కేంద్రాల వరకు జరిగిన మార్పులను ప్రదర్శనకు ఉంచారు. పాతకాలపు సంకెళ్లు, జైలు గదులతో పాటు భక్త రామదాసు, దాశరథి కృష్ణమాచార్యులు వంటి ప్రముఖులు జైలు జీవితం గడిపిన వివరాలను పొందుపరిచారు. అంతేగాక నాగార్జున సాగర్ డ్యామ్ నిర్మాణంలో ఖైదీల పాత్ర వంటి ఆసక్తికరమైన అంశాలను ఈ మ్యూజియంలో చూడవచ్చు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. "జైళ్లను కేవలం శిక్షా కేంద్రాలుగా కాకుండా, సంస్కరణ, పరివర్తన కేంద్రాలుగా చూడాలి. నేరస్థులకు శిక్షతో పాటు పునరావాసం, రెండో అవకాశం కల్పించడంపై ఒక ప్రగతిశీల సమాజం దృష్టి సారించాలి" అని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం రాష్ట్ర సంస్కరణ చర్యలలో ఒక కొత్త అధ్యాయమని, దీనివల్ల జైళ్ల పరిపాలన, ఖైదీల పునరావాసంపై ప్రజలకు మెరుగైన అవగాహన కలుగుతుందని జైళ్ల శాఖ డీజీపీ సౌమ్య మిశ్రా తెలిపారు. గతంలో సంగారెడ్డి హెరిటేజ్ జైలు మ్యూజియంలో ప్రారంభించిన 'ఒక రోజు జైలు అనుభవం' కార్యక్రమం నుంచి స్ఫూర్తి పొంది, మరింత వ్యవస్థీకృతంగా చంచల్‌గూడలో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా, డబ్బులు చెల్లించి ఖైదీగా ఒక్కరోజు గడపాలన్న ఆలోచనపై నెటిజన్లు ఆసక్తిగా స్పందిస్తున్నారు.



# భగీరథ్‌పై లుకౌట్ నోటీసులు: కవిత

హైదరాబాద్, మే 13 (ఈవార్తలు): కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత విమర్శనాస్త్రాలు సంధించారు. పోక్సో కేసులో ఉన్న బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా పోలీసులు వెంటనే లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఒకవేళ నేరం రుజువైతే బండి సంజయ్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని స్పష్టం చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి తండ్రిగా బండి సంజయ్ ప్రధాని మోదీతో కలిసి వేదికను పంచుకోవడం ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపిందని ఆమె అభిప్రాయపడ్డారు. బాధితురాలి జీవితాన్ని దెబ్బతీసేలా వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని, ఆ అకౌంట్లను బ్లాక్ చేయాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయాలని కవిత అన్నారు. ఇప్పటివరకు ఆయన ఈ ప్రాజెక్టును ఒక్కసారి కూడా సందర్శించకపోవడం ఏమిటని ఆమె ఆక్షేపించారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారని, కానీ తెలంగాణ ప్రభుత్వం నీటి వనరుల వినియోగంలో విఫలమవుతోందని విమర్శించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కులగణనలో ఓబీసీ కాలమ్ తప్పనిసరిగా ఉండాలని, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం దేశవ్యాప్తంగా పోరాడతామని కవిత తెలిపారు. నీట్ పేపర్ లీక్ గురించి ఆమె మాట్లాడుతూ... జాతీయ స్థాయి పరీక్షల పేపర్ లీక్ ఘటనలను కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలని, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. తెలంగాణలో ఉన్న రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికే తమ పార్టీ పుట్టిందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## పంటలకు మద్దతు ధర పెంపు

**రైతులకు కేంద్రం గుడ్ న్యూస్**

**రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాలపై నిర్ణయాలు**

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగానికి భారీ ఊరటనిచ్చింది. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా, ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను ప్రభుత్వం పెంచింది. పెట్టుబడి ఖర్చుపై 50 శాతం అదనంగా కలిపి కొత్త ధరలను ఖరారు చేశారు. వరి క్వింటాల్‌కు రూ. 2,441 గా నిర్ణయించారు. గ్రేడ్-ఏ వరి క్వింటాల్‌కు రూ. 2,461 గా మద్దతు ధరను ఖరారు చేశారు. ఈ ఖరీఫ్ సీజన్ మద్దతు ధర కోసం కేంద్రం ఏకంగా రూ. 2.6 లక్షల కోట్లను కేటాయించడం విశేషం. వ్యవసాయంతో పాటు రవాణా, ఇంధన రంగాలకు కూడా కేంద్ర కేబినెట్ పెద్దపీట వేసింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదం తెలిపారు. ఇంధన భద్రత కోసం ఈ పథకానికి రూ. 37,500 కోట్లు కేటాయించారు. సర్కేజీ - ధోలేరా మధ్య సెమీ హై స్పీడ్ డబుల్ రైల్వే లైన్ నిర్మాణం కోసం రూ. 20,065 కోట్లు మంజూరు చేస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

## సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలు విడుదల

**గతానికన్నా 3 శాతం పడిపోయిన పాస్ పర్సెంటేజీ**

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 2026 సంవత్సరానికి గాను 12వ తరగతి ఫలితాలను బుధవారం విడుదల చేసింది. ఈ ఏడాది మొత్తం ఉత్తీర్ణత శాతం 85.20గా నమోదైంది. గతేడాది నమోదైన 88.39 శాతంతో పోలిస్తే ఇది సుమారు 3 శాతం తగ్గడం గమనార్హం. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 17,68,968 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎప్పటిలాగే, ఈసారి కూడా ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. బాలికల ఉత్తీర్ణత శాతం 88.86గా ఉండగా, బాలుర ఉత్తీర్ణత శాతం 82.13గా నమోదైంది. అబ్బాయిల కంటే అమ్మాయిలు 6.73 శాతం అధికంగా ఉత్తీర్ణులయ్యారు. ప్రాంతాల వారీగా చూస్తే, కేరళలోని తిరువనంతపురం 95.62 శాతం ఉత్తీర్ణతతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ రీజియన్ 72.43 శాతంతో చివరి స్థానంలో ఉంది. ఈసారి సుమారు 1,63,000 మంది విద్యార్థులు కంపార్ట్‌మెంట్ (సప్లిమెంటరీ) కేటగిరీలో ఉన్నారు. ఈ సంఖ్య గతేడాదితో పోలిస్తే 2 శాతానికి పెరిగింది. మరోవైపు, 94,000 మందికి పైగా విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించగా, 17,000 మందికి పైగా 95 శాతానికి పైగా స్కోర్ చేశారు. విద్యార్థులు తమ ఫలితాలను సీబీఎస్ఈ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. మార్క్‌షీట్లు కూడా అందుబాటులో ఉంచినట్లు బోర్డు తెలిపింది.

## ఐఆర్జీసీ గోతులు చెప్తే 145 కోట్లు

**అమెరికా బంపర్ బొనాంజా ప్రకటన**

వాషింగ్టన్: ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఆర్థిక మూలాల గురించి సమాచారం ఇచ్చిన వారికి 15 మిలియన్ డాలర్ల బహుమతిని ఇస్తామని అమెరికా విదేశాంగ శాఖ భారీ ఆఫర్ ఇచ్చింది. ఇది మన కరెన్సీలో సుమారు రూ.145 కోట్లు ఉంటుంది. యుద్ధాన్ని ముగించడానికి అమెరికా, ఇరాన్ తీసుకుంటున్న చర్యల్లో పురోగతి కనిపించడంలేదు. యుద్ధాన్ని ముగించడానికి వాషింగ్టన్ చేసిన ప్రతిపాదనలను టెహ్రాన్ అంగీకరించలేదు. దీంతో ఒప్పందం ఆలస్యమవుతోంది. ఈ క్రమంలో అమెరికా విదేశాంగ శాఖ భారీ ఆఫర్ ఇచ్చింది. ఐఆర్‌జీసీ, దాని సంబంధిత శాఖలకు కీలక ఆర్థిక వనరులను అందించే బినామీ కంపెనీలు, వ్యక్తులు, ఆర్థిక సంస్థల సమాచారాన్ని తమకు తెలియజేయాలని కోరింది. గల్ఫ్ దేశాలపై దాడులు చేయకుండా, అణు కార్యక్రమాలు చేపట్టకుండా ఇరాన్‌ను దెబ్బతీయడమే లక్ష్యమని స్పష్టం చేసింది. మరోవైపు, యుద్ధాన్ని ముగించేందుకు అవసరమైన ప్రతి అవకాశాన్ని తాము వినియోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ పేర్కొన్నారు. అదే సమయంలో ఏ విధమైన దురాక్రమణకైనా తగిన గుణపాఠం చెప్పేందుకు తమ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. తప్పుడు అంచనాలు, తప్పుడు నిర్ణయాలు ఎల్లప్పుడూ తప్పుడు ఫలితాలనే ఇస్తుందని అన్నారు. చర్చల్లో భాగంగా తమ ప్రతిపాదనలను అమెరికా అంగీకరించాల్సిందేనని, మరో మార్గం లేదని స్పష్టం చేశారు.

## 'కునో'లో నాలుగు చీతా కూనల మృతి

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో విషాదం చోటుచేసుకుంది. నెల రోజుల వయసున్న నాలుగు చీతా కూనలు మంగళవారం ఉదయం మృతి చెందాయి. వేరే జంతువు దాడి చేయడం వల్లే ఇవి చనిపోయి ఉంటాయని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. షియోపూర్ జిల్లాలోని కునో పార్కులో మానిటరింగ్ బృందం ఈ విషయాన్ని గుర్తించింది. కేజీపీ12 అనే ఆడ చీతా ఏప్రిల్ 11న ఈ నాలుగు కూనలకు జన్మనిచ్చింది. మే 11వ తేదీ సాయంత్రం వరకు ఇవి ఆరోగ్యంగానే కనిపించాయని అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం 6:30 గంటల ప్రాంతంలో వీటి డెన్ సమీపంలో కళేబరాలను గుర్తించామని, అవి పాక్షికంగా తినివేసి ఉన్నాయని వివరించారు. తల్లి చీతా మాత్రం క్షేమంగా, ఆరోగ్యంగా ఉందని అధికారులు స్పష్టం చేశారు. పోస్ట్‌మార్టం నివేదిక, పూర్తి స్థాయి విచారణ తర్వాత మరణానికి కచ్చితమైన కారణాలు తెలుస్తాయని వారు పేర్కొన్నారు. ఈ నాలుగు కూనల మరణంతో భారత్‌లో చీతాల సంఖ్య 53కి తగ్గింది. ప్రస్తుతం కునో పార్క్‌లో 50 చీతాలు (వీటిలో 33 భారత్‌లో పుట్టినవి), గాంధీ సాగర్ అభయారణ్యంలో మూడు చీతాలు ఉన్నాయి. మిగిలిన చీతాలన్నీ ఆరోగ్యంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. కాగా, 2022లో నమీబియా నుంచి 8, 2023లో దక్షిణాఫ్రికా నుంచి 12, ఈ ఏడాది ఫిబ్రవరిలో బోట్స్వానా నుంచి 9 చీతాలను భారత్‌కు తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

## అమెరికా 51వ రాష్ట్రంగా వెనెజువెలా!?

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం వెనెజువెలాను అమెరికాలోని 51వ రాష్ట్రంగా పేర్కొంటూ ఒక గ్రాఫిక్ ఫొటోను సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. ఈ పోస్టు తీవ్ర దుమారం రేపింది. ట్రంప్ పోస్టును వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడు డెల్సీ రోడ్రిగ్జ్ తీవ్రంగా ఖండించారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించిన సమయంలో ఆయన నైట్ ట్రాక్ సూట్‌ను ధరించారు. ఆ సూట్‌ను పోలిన ట్రాక్ సూట్‌ను ధరించి, ఎయిర్ ఫోర్స్ వన్‌లో విమానంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ప్రయాణిస్తున్నట్లు కూడా ఈ పోస్టు ఉంది. డొనాల్డ్ ట్రంప్ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో సమావేశమయ్యేందుకు చైనాకు వెళ్లనున్న సమయంలో, సామాజిక మాధ్యమంలో ఈ పోస్టు పెట్టడం చర్చకు దారి తీసింది. వైట్ హౌస్ కూడా ఈ ఫొటోలను తన ఎక్స్ ఖాతాలో విడుదల చేసింది. వెనెజువెలాను తమ దేశంలోని కొత్త రాష్ట్రంగా పరిగణించాలని భావిస్తున్నట్లు ఇటీవల ఫాక్స్ న్యూస్‌తో ట్రంప్ పేర్కొన్నారు.

# మోదీ కాన్వాయ్ తగ్గింపు

**పొదుపు చర్యల్లో భాగంగా నిర్ణయం.. ఎలక్ట్రిక్ వాహనాలు పెంచాలని ఎస్పీజీకి సూచన**



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ పొదుపు, ఇంధన పరిరక్షణ దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారు. తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడంతో పాటు ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో ఇంధన వినియోగాన్ని పరిమితం చేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టారు. తన భద్రతా బాధ్యతలు చూసే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ)ను ఉద్దేశించి, కాన్వాయ్‌లో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్యను పెంచాలని, అయితే దీనికోసం కొత్త వాహనాలు కొనుగోలు చేయవద్దని స్పష్టంగా సూచించారు. భద్రతా ప్రమాణాలైన 'బ్లూ బుక్' మార్గదర్శకాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఎస్పీజీ ఈ ఆదేశాలను అమలు చేయడం ప్రారంభించింది. ప్రధాని తీసుకున్న ఈ నిర్ణయం స్ఫూర్తితో బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా అదే బాటలో పయనిస్తున్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ వంటి వారు కూడా తమ అధికారిక కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను తగ్గించుకోవాలని నిర్ణయించారు. ఇది దేశవ్యాప్తంగా పరిపాలనలో పొదుపును ప్రోత్సహించే విస్తృత ప్రయత్నాలలో భాగంగా కనిపిస్తోంది. ప్రభుత్వ స్థాయిలో పొదుపు చర్యలు చేపడుతూనే, ప్రజలు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని ప్రధాని మోదీ ఇటీవల పిలుపునిచ్చారు. అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా పెరిగిన ముడి చమురు ధరలు, ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, ద్రవ్యోల్బణం వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. "ప్రతిదానికీ దిగుమతులపై ఆధారపడితే దేశం ఎలా అభివృద్ధి చెందుతుంది?" అని ప్రశ్నిస్తూ, స్థానిక ఉత్పత్తుల వాడకాన్ని ప్రోత్సహించాలని కోరారు. అంతేగాక ప్రజలు తమ జీవనశైలిలో బాధ్యతాయుతమైన మార్పులు చేసుకోవాలని ప్రధాని సూచించారు. విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడం కూడా దేశభక్తితో సమానమని చెబుతూ, ప్రజలు ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనుగోళ్లు, విదేశీ ప్రయాణాలు, విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లు వంటివి వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి బదులుగా దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని, వేడుకలను దేశంలోనే జరుపుకోవాలని ఆయన కోరారు.

## మోదీని చూసి నేర్చుకోండి

**ప్రధానిని ఆకాశానికెత్తేసిన నార్వే దినపత్రిక**



లండన్: భారత ప్రధాని నరేంద్ర మోదీపై నార్వేకు చెందిన ప్రముఖ ఆర్థిక దినపత్రిక 'డాగెన్స్ నారింగ్స్‌లివ్' (డీఎన్) ప్రశంసల వర్షం కురిపించింది. మోదీని "ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన రాజకీయ నాయకుడు" అని అభివర్ణించిన ఆ పత్రిక, నార్డిక్ దేశాల ప్రధానులు ఆయన నుంచి ఎంతో నేర్చుకోవాలని సూచిస్తూ ఒక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. మే 18న ప్రధాని మోదీ నార్వే పర్యటనకు రానున్న నేపథ్యంలో ఈ కథనం వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది. నార్డిక్ దేశాల ప్రధానులకు కనీసం 30 శాతం ప్రజామోదం కూడా దక్కడం లేదని, కానీ మోదీకి సుమారు 70 శాతం ప్రజామోదం ఉందని ఆ కథనం పేర్కొంది. "ఏ పెద్ద దేశంలోనూ ఏ నాయకుడికీ స్వదేశంలో మోదీ అంతటి జనాదరణ లేదు. ఆయన మళ్లీ పోటీ చేస్తే కచ్చితంగా గెలుస్తారు. ఇది యూరప్ నేతలకు అందని కల" అని వ్యాఖ్యానించింది. మోదీ విజయం వెనుక వేగవంతమైన ఆర్థికాభివృద్ధి, బలమైన భావజాలం, ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన రాజకీయ పార్టీ, ఆయన స్ఫూర్తిదాయక జీవిత ప్రస్థానం ఉన్నాయని విశ్లేషించింది. సాధారణ కుటుంబం నుంచి వచ్చి, ఉన్నతస్థాయికి ఎదిగిన మోదీ ప్రస్థానం అరుదైనదని, ఈ విషయంలో ఆయనను నార్వే మాజీ ప్రధాని ఐనార్ గెర్హార్డ్‌సెన్‌తో పోల్చింది. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ 7 శాతం వృద్ధితో చైనాను మించి దూసుకెళ్తోందని, 2050 నాటికి ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అంచనా వేసింది. పర్యావరణ హిత వృద్ధిలోనూ భారత్ ముందుందని, సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉందని గుర్తుచేసింది. బీజేపీ పాలనలో మత ఘర్షణలు పెరిగాయన్న విమర్శలను కూడా ఈ కథనం తోసిపుచ్చింది. కాంగ్రెస్ హయాంలోనే ఎక్కువ హింసాత్మక ఘటనలు జరిగాయని, పొరుగు దేశాల నుంచి లక్షలాది మంది ముస్లింలు భారత్‌కు వలస వస్తున్నారని, కానీ భారత్ నుంచి వెళ్లడం లేదని పేర్కొంది. నియమాల ఆధారిత ప్రపంచం కోసం నార్వేకు భారత్ వంటి మిత్రదేశాలు అవసరమని, భారత్‌కు నీతులు చెప్పడం మాని, ఆ దేశం నుంచి నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలని ఆ పత్రిక తన కథనాన్ని ముగించింది.

# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం తీవ్ర ఒడుదొడుకుల మధ్య స్వల్ప లాభాలతో ముగిశాయి. మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు లభించగా, ఐటీ, బ్యాంకింగ్, ఆటో కౌంటర్లలో బలహీనత కారణంగా లాభాలు పరిమితమయ్యాయి. రోజంతా తీవ్ర హెచ్చుతగ్గులకు లోనైన సూచీలు చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, 30 షేర్ల సెన్సెక్స్ 49.74 పాయింట్లు పెరిగి 74,608.98 వద్ద స్థిరపడింది. రోజులో ఒకానొక దశలో 74,134.48 కనిష్ట స్థాయికి పడిపోయిన సూచీ, మరో దశలో 75,191.57 గరిష్టాన్ని తాకింది. ఇక నిఫ్టీ 33.05 పాయింట్లు లాభపడి 23,412.60 వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 23,262.55 కనిష్టాన్ని, 23,582.95 గరిష్టాన్ని నమోదు చేసింది. విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి తక్షణ మద్దతు 23,300 వద్ద, ఆ తర్వాత 23,100 వద్ద కొనసాగుతోంది. మరోవైపు, 23,500 స్థాయిని అధిగమించడంలో విఫలం కావడంతో అది తక్షణ నిరోధకంగా మారింది. నిఫ్టీలో ఏషియన్ పెయింట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, టాటా స్టీల్ వంటివి టాప్ గెయినర్లుగా నిలిచి మార్కెట్లకు అండగా నిలిచాయి. బ్రాడర్ మార్కెట్లు కూడా సానుకూలంగానే ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.77 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.31 శాతం చొప్పున లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ సూచీలు మంచి పనితీరు కనబరచగా, నిఫ్టీ ఐటీ, ఆటో, బ్యాంక్, మీడియా సూచీలు నష్టాలను చవిచూశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మధ్య జరగనున్న సమావేశం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. వాణిజ్య సంబంధిత సమస్యలపై ఈ భేటీలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. అలాగే, పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా ఇరాన్‌పై వాషింగ్టన్ కఠిన వైఖరి కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. వాణిజ్య, భౌగోళిక రాజకీయ అంశాలపై మరింత స్పష్టత కోసం మార్కెట్లు ఇప్పుడు యూఎస్-చైనా శిఖరాగ్ర సమావేశం ఫలితాలను నిశితంగా గమనిస్తాయి.

## విజయ్ ఓఎస్డీగా జ్యోతిష్యం నియామకం రద్దు

చెన్నై: తమిళనాడులో కొత్తగా కొలువుదీరిన ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తొలిరోజే తీవ్ర వివాదంలో చిక్కుకుంది. బుధవారం ఉదయం విశ్వాస పరీక్షలో నెగ్గిన వెంటనే, రాధన్ పండిట్ వెట్రివేల్ అనే జ్యోతిష్కుడిని ముఖ్యమంత్రికి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (పొలిటికల్)గా నియమించడం పెను దుమారం రేపింది. మిత్రపక్షాలు, ప్రతిపక్షాల నుంచి వచ్చిన తీవ్ర వ్యతిరేకతతో ప్రభుత్వం కొన్ని గంటల్లోనే ఆ నియామకాన్ని వెనక్కి తీసుకుంది. విశ్వాస పరీక్ష సందర్భంగా అసెంబ్లీలో మాట్లాడిన డీఎండీకే చీఫ్ ప్రేమలత విజయకాంత్, ఈ నియామకాన్ని తీవ్రంగా ఖండించారు. "ముఖ్యమంత్రి ఓఎస్డీగా ఒక జ్యోతిష్కుడిని నియమించడాన్ని నేను ఖండిస్తున్నాను. దీని ద్వారా యువతకు ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారు? ఆయన మీ వ్యక్తిగత జ్యోతిష్కుడైతే, వ్యక్తిగతంగానే ఉంచుకోవాలి" అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి మద్దతిస్తున్న కీలక మిత్రపక్షాలైన విడుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), కాంగ్రెస్ కూడా ఈ నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. "ఇది ఒక లౌకిక ప్రభుత్వంలో ఆమోదయోగ్యం కాదు. ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ప్రభుత్వ కర్తవ్యం" అని వీసీకే ప్రధాన కార్యదర్శి డి. రవికుమార్ పేర్కొంటూ, వెంటనే అతడిని తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ కూడా.. "ఒక జ్యోతిష్కుడికి ఓఎస్డీ పదవి ఎందుకు అవసరం?" అని సోషల్ మీడియాలో ప్రశ్నించారు. విమర్శలు వెల్లువెత్తడంతో టీవీకే నేత సీటీ నిర్మల్ కుమార్ తొలుత ఈ నియామకాన్ని సమర్థించే ప్రయత్నం చేశారు. వెట్రివేల్‌ను మీడియా ప్రతినిధిగా నియమించామని, ఆయన వృత్తితో సంబంధం లేదని తెలిపారు. అయితే, ఒత్తిడి పెరగడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఆసక్తికరంగా ఈ విషయంలో బీజేపీ విజయ్ కు అనుకూలంగా స్పందించింది. రాధన్ పండిట్ వెట్రివేల్‌కు గతంలోనూ రాజకీయ ప్రముఖులతో సంబంధాలున్నాయి. దివంగత ముఖ్యమంత్రి జయలలితకు కూడా ఆయన సలహాదారుగా వ్యవహరించినట్లు సమాచారం. అక్రమాస్తుల కేసులో ఆమె జైలుకు వెళ్లరని వెట్రివేల్ చెప్పిన జోస్యం విఫలం కావడంతో వారి మధ్య విభేదాలు వచ్చినట్లు కథనాలొచ్చాయి. ఏదేమైనా, మిత్రపక్షాల నుంచి వచ్చిన తీవ్ర ఒత్తిడి కారణంగా, విజయ్ సర్కార్ వివాదాస్పద

# ఈ సర్కారు ఉండేది ఎంత కాలమో!

**అసెంబ్లీలో ఉదయనిధి స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు**



చెన్నై: తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ఎన్నికైన టీవీకే అధినేత విజయ్ అసెంబ్లీలో తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో స్పష్టమైన మెజారిటీతో విజయ్ ప్రభుత్వం నెగ్గింది. విశ్వాస పరీక్షకు ఓటింగ్ సందర్భంగా డీఎంకే సభ నుంచి వాకౌట్ చేసింది. విశ్వాస పరీక్ష సందర్భంగా ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ సభలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్త ప్రభుత్వాన్ని ఉద్దేశించి, ఈ ప్రభుత్వం ఎంతకాలం మనుగడ సాగిస్తుందోనని రాష్ట్ర ప్రజలు ప్రశ్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎంతకాలం మనుగడ సాగిస్తుందో తెలియని ప్రభుత్వానికి ఓటు వేసినందుకు ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారని అన్నారు. తమిళనాడులో లౌకికవాద ప్రభుత్వమే ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నికల్లో రాష్ట్రంలోని దాదాపు 65 శాతం మంది ఓటర్లు ముఖ్యమంత్రి విజయ్, టీవీకేను తిరస్కరించారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మిత్రపక్షాలతో కలిసి అధికారంలోకి వచ్చారని, కనీసం ఇప్పుడైనా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే రీతిలో పనిచేయాలని సూచించారు. ఎందుకంటే మీకు ఓటు వేసిన ప్రజలే ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందోనని ప్రజల్లో అనుమానాలు నెలకొన్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కొత్త ప్రభుత్వానికి సూచించారు. విశ్వాస ఓటింగ్‌లో తమ పార్టీ పాల్గొనడం లేదని, డీఎంకే ఎమ్మెల్యేలం వాకౌట్ చేస్తున్నామని ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. డీఎంకేతో పాటు మిత్రపక్షమైన ఎంఎంకే కూడా విశ్వాస పరీక్షను వ్యతిరేకించింది. మంత్రివర్గంలో ముస్లింలకు ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ఆ పార్టీ నాయకుడు జవహిరుల్లా ప్రస్తావించారు. డీఎంకే మరో మిత్రపక్షం ఎంజేకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు ప్రకటించాయి. ఏఎంఎంకే పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే ఎస్. కామరాజ్ కూడా ప్రభుత్వానికి మద్దతు పలికారు. దీంతో ఆయనను ఏఎంఎంకే పార్టీ నుంచి బహిష్కరించారు.

## నీట్ వ్యవస్థనే రద్దు చేయాలి

**పేపర్ లీక్, పరీక్ష రద్దుపై తమిళనాడు సీఎం విజయ్**

**ఇది వ్యవస్థాగత లోపాలకు నిదర్శనమని వ్యాఖ్య**

చెన్నై: వైద్య విద్య జాతీయ అర్హత పరీక్ష (నీట్-యూజీ) 2026 పరీక్ష రద్దుపై తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ స్పందించారు. నీట్ వ్యవస్థనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ కావడం, పరీక్ష రద్దు వంటివి వ్యవస్థాగత లోపాలకు నిదర్శనమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమిళనాడు మొదటి నుంచి నీట్‌ను వ్యతిరేకించిందని ఆయన గుర్తు చేశారు. ఈ పరీక్షతో గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలలు, తమిళ మీడియం విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 12వ తరగతి మార్కుల ఆధారంగా సీట్లను భర్తీ చేయడానికి రాష్ట్రాలకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని విజయ్ కోరారు. ఇదిలా ఉండగా, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో సీబీఐ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. జైపూర్‌లో ముగ్గురిని, గురుగ్రామ్‌లో ఒకరిని, నాసిక్‌లో ఒకరిని.. ఇలా ఇప్పటి వరకు ఐదుగురిని అరెస్టు చేసింది. బుధవారం ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సహా పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుంది.

## ములాయం చిన్న కొడుకు కన్నుమూత

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ములాయం సింగ్ యాదవ్ చిన్న కుమారుడు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ సవతి సోదరుడు ప్రతీక్ యాదవ్ (38) ఆకస్మిక మరణం చెందారు. లక్నోలో బుధవారం ఆయన తుదిశ్వాస విడిచారు. బుధవారం ఉదయం 6:15 గంటల సమయంలో కుటుంబ సభ్యులు ప్రతీక్‌ను లక్నో సివిల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆ సమయంలో ఆయన భార్య, బీజేపీ నేత అపర్ణా యాదవ్ అక్కడ లేరని సమాచారం. కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న ప్రతీక్, ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టడంతో చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఉదయం ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రికి తరలించారు. ప్రతీక్ మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని ప్రాథమికంగా గుర్తించారు. మృతికి కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ వైద్యుల బృందం పోస్ట్‌మార్టం నిర్వహించనుంది. కాగా, ప్రతీక్ యాదవ్ ఇటీవలి కాలంలో తన వ్యక్తిగత జీవితం కారణంగా వార్తల్లో నిలిచారు. తన భార్య అపర్ణా యాదవ్‌తో విడాకులు తీసుకోబోతున్నట్లు కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటించి సంచలనం సృష్టించారు.



## ధాన్యం కొనుగోళ్లలో జాప్యం సరికాదు

**రైతులను గాలికి వదిలేసింది.. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

ధర్మపురి, మే 13 (ఈవార్తలు): ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం సరికాదని, ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లను వేగవంతం చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం ధర్మపురి మండలం దొంతాపూర్, మగ్గిడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన మక్క, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఆయన, కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యంపై ఆరాతీశారు. ఈసారి రైతులు పెద్దఎత్తున వరి, మొక్కజొన్న పంటలు పండించారని, ప్రభుత్వం ముందస్తుగా గోదాములు, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులు 15 రోజులుగా బస్తాలు పోసి కేంద్రాల వద్ద ఎదురుచూస్తున్నారని, లారీలు సరిగా రాకపోవడంతో ధాన్యం పేరుకుపోతుందని తెలిపారు. క్వింటాల్‌కు 2.5 నుంచి 5 కిలోల వరకు తరుగు పేరుతో కోతలు విధిస్తున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని గుర్తుచేసిన ఆయన, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసిందని ఆరోపించారు. వర్షాలు కురిస్తే రైతుల పరిస్థితి ఏమవుతుందో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రైతుల సమస్యలపై స్పందించాలని, కొనుగోలు కేంద్రాలను సందర్శించి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## గన్ను వదిలి పెన్ను పట్టి..!

**42 ఏళ్ల తర్వాత పరీక్షా హాల్లో దేవ్ జీ**

కోరుట్ల, మే 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్లలో బుధవారం నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రంలో ఓ మాజీ మావోయిస్టు నేత పరీక్ష రాయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒకప్పుడు అడవుల్లో తుపాకీతో తిరిగిన మాజీ మావోయిస్టు అగ్రనేత కామ్రేడ్ తిప్పిరి తిరుపతి అలియాస్ "దేవ్ జీ" దాదాపు 42 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా మారి తెలుగు పరీక్ష రాశారు. 1982లో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న సమయంలో తెలుగు పరీక్ష రాయకపోవడంతో ఆయన ఇంటర్ విద్య అసంపూర్తిగా మిగిలిపోయింది. అదే సమయంలో సమాజంలోని అసమానతలు, పేదల సమస్యలు ఆయనను విప్లవ మార్గం వైపు నడిపించాయి. అనంతరం మావోయిస్టు ఉద్యమంలో కీలక నేతగా ఎదిగిన ఆయన "దేవ్ జీ"గా గుర్తింపు పొందారు. కాలక్రమేణా సాధారణ జీవనంలోకి వచ్చిన దేవ్ జీ, జీవితంలో మిగిలిపోయిన అసంపూర్తిని పూర్తి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఇంటర్ బోర్డును సంప్రదించి ప్రత్యేక అనుమతి తీసుకొని బుధవారం కోరుట్లలో నిర్వహించిన పరీక్షకు హాజరయ్యారు. నాలుగు దశాబ్దాల తర్వాత పరీక్షా హాల్లోకి వచ్చిన దేవ్ జీని చూసి విద్యార్థులు, అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటర్ పూర్తి చేసిన తర్వాత న్యాయ విద్య అభ్యసించి పేదలకు న్యాయ సహాయం అందించాలనేది తన కోరిక అని తెలిపారు.

## బీజేపీ ధర్మదీక్ష రాజకీయ డ్రామా: సంజయ్

జగిత్యాల, మే 13 (ఈవార్తలు): బీజేపీ చేపట్టిన ధర్మదీక్ష పూర్తిగా రాజకీయ డ్రామా అని, జగిత్యాల నియోజకవర్గంలో విద్యాసంస్థల ఏర్పాటుకు తాను కట్టుబడి ఉన్నానని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. బీజేపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మోతె పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగిత్యాల అభివృద్ధి కోసం నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌తో కలిసి పలువురు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్‌లలో జగిత్యాలకు కూడా ఒకటి మంజూరైందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉపయోగపడే నవోదయ పాఠశాలను జగిత్యాలకు కాకుండా కోరుట్లకు మంజూరు చేశారని విమర్శించారు. చల్గల్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని తాను రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. చల్గల్ ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన కూడా జరిగిందన్నారు. కేంద్రీయ విద్యాలయం పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ల వల్ల జగిత్యాల జిల్లా విద్యార్థులకు ఎక్కువ ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్‌హెచ్-61 రహదారులు, బ్రిడ్జిలు తదితర అభివృద్ధి పనులపై కేంద్ర మంత్రులను పలుమార్లు కలిసినా స్పందన రాలేదన్నారు. చల్గల్‌లో స్థలం కేటాయించని పరిస్థితిలో హనుమాజీపేట్, అంతర్గాం, టీఆర్‌నగర్ ప్రాంతాల్లో కూడా స్థలాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయొద్దు

**చదువుల తల్లి స్థలం కోసం ఎంపీ అరవింద్ ధర్మదీక్ష.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థలం కేటాయించాలి: భోగ శ్రావణి**

జగిత్యాల, మే 13 (ఈవార్తలు): విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం తగదని జగిత్యాల బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి అన్నారు. బుధవారం రాయికల్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగిత్యాలలో నవోదయ పాఠశాల, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం పాఠశాలలను మంజూరు చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా స్థలం కేటాయించకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ చొరవతో జగిత్యాలకు కేంద్రీయ విద్యాలయం మంజూరైందని, అయితే స్థలం కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కోరుట్లలో నవోదయ పాఠశాల ప్రారంభమై అడ్మిషన్లు కొనసాగుతుండగా,



జగిత్యాలలో మాత్రం విద్యార్థులు రెండేళ్లుగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 15లోపు ప్రభుత్వం స్థలం కేటాయించాలని, లేకపోతే జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎంపీ అరవింద్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుర్మా మల్లారెడ్డి, ఆకుల మహేష్, కల్లెడ ధర్మపురి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా బక్రీద్ జరుపుకోవాలి

**జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**

జగిత్యాల, మే 13 (ఈవార్తలు): బక్రీద్ పండుగను మత సామరస్యానికి ప్రతీకగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ సూచించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులు, మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాలు, పట్టణాల్లోని మసీదుల వద్ద పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్లాటర్ హౌస్‌ల వద్ద వ్యర్థాలను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని, అవసరమైన కవర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. పశువుల రవాణా, ధ్రువీకరణ అంశాల్లో వెటర్నరీ అధికారులు నిరంతరం అందుబాటులో ఉ



ండాలని ఆదేశించారు. జిల్లాలో వెల్గటూర్, ధర్మపురి, మెట్‌పల్లి, కొడిమ్యాల, రాయికల్ ప్రాంతాల్లో ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ చేతన్ నితిన్, అడిషనల్ కలెక్టర్ రాజగౌడ్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కిషోర్, వివిధ శాఖల అధికారులు, మత పెద్దలు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో సంజయ్

జగిత్యాల, మే 13 (ఈవార్తలు): జగిత్యాల పట్టణ 19వ వార్డుకు చెందిన తీరం దాసు మమత-శ్రీనివాస్ దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గృహ యజమానులకు చీరను కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సమీండ్ల వాణి శ్రీనివాస్, కమిషనర్ సత్య ప్రణవ్, స్థానిక కౌన్సిలర్ లావణ్య రాజు, మాజీ కౌన్సిలర్ తోట మల్లికార్జున్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మక్క కొనుగోళ్లలో వేగం పెరగాలి

**అధికారులకు మంత్రి అడ్లూరి ఆదేశాలు**

గొల్లపల్లి, మే 13 (ఈవార్తలు): గొల్లపల్లి మండలంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద ఇటీవల జరిగిన లారీ ప్రమాద ఘటనపై రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించారు. బుధవారం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మంత్రి, ప్రమాదంలో గాయపడిన రైతులను పరామర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో రైతులు గాయపడటంతో పాటు అక్కడ నిలిపి ఉంచిన మోటార్ సైకిళ్లు కూడా దెబ్బతిన్నాయి. ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న పరిస్థితులను పరిశీలించిన మంత్రి, రైతులు ఇబ్బందులు పడకుండా మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదంలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చిన మంత్రి, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతుకు అన్ని విధాల సహాయం అందిస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సూచించారు.

## అనంతబాబు బెయిల్ రద్దు

రాజమండ్రి, మే 13 (ఈవార్తలు): డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో కీలక నిందితుడిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు రాజమండ్రి ప్రత్యేక న్యాయస్థానం షాక్ ఇచ్చింది. ఈ కేసులో అనంతబాబుకు సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే, బెయిల్ పై ఉంటూ ఆయన ఈ కేసులో నలుగురు కీలక సాక్షులను ప్రలోభపెట్టడం, తమకు అనుకూలంగా మారకపోతే చంపుతామని బెదిరించడం వంటి అక్రమాలకు పాల్పడ్డారు. దీనిని తీవ్రంగా పరిగణించిన రాజమండ్రి ప్రత్యేక న్యాయస్థానం, అనంతబాబు బెయిల్‌ను రద్దు చేస్తూ సంచలన తీర్పునిచ్చింది. సాక్షులను బెదిరించిన వ్యవహారంలో ఏప్రిల్ 24న సర్పవరం పోలీసులు అనంతబాబును అరెస్ట్ చేయగా, ప్రస్తుతం ఆయన రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. సమర్థవంతంగా వాదనలు వినిపించి, సాక్షుల బెదిరింపులకు సంబంధించిన ఆధారాలను కోర్టు ముందు ఉంచారు.





## బక్రీద్ నేపథ్యంలో హై అలర్ట్

జగిత్యాల, మే 13 (ఈవార్తలు): రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా సరిహద్దులు, ప్రధాన రహదారులు, చెక్‌పోస్టుల వద్ద పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. గోవులు, దూడలను నిబంధనలకు విరుద్ధంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పశువైద్యుల ధ్రువీకరణ పత్రాలు లేకుండా జంతువులను రవాణా చేస్తే వాహనాలను జప్తు చేసి, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమ పశువుల రవాణాపై సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, నిందితులపై ప్రత్యక్ష దాడులకు పాల్పడవద్దని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అక్రమ పశువుల రవాణా అరికట్టేందుకు పోలీసు శాఖ, పశుసంవర్ధక శాఖ సంయుక్త బృందాలు 24 గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



## రైతులను ఇబ్బంది పెట్టొద్దు

**అధికారుల ఆదేశాలు**

**కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల పరిశీలన**

జగిత్యాల, మే 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో కొనసాగుతున్న వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అధికారులు వరి కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఎస్ఐలు, ఎంపీడీఓలు, ఎంఆర్వోలు, ఏపీఎంలు, ప్యాక్స్ సీఈఓలు సంయుక్తంగా పలు కొనుగోలు కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ, వరి అన్‌లోడింగ్, రవాణా వాహనాల కదలిక, వరి నిల్వ, మిల్లులకు తరలింపు తదితర అంశాలపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. లారీలు, ట్రాక్టర్ల రాకపోకలు సజావుగా సాగుతున్నాయా, అన్‌లోడింగ్, తూకం ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందా అనే అంశాలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు సంబంధిత సిబ్బందికి సూచించారు.



## వైద్య చికిత్సలకు కోరుట్ల ఎమ్మెల్యే ఎల్వోసీలు

మెట్‌పల్లి, మే 13 (ఈవార్తలు): మెట్‌పల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ వైద్య చికిత్సల నిమిత్తం పలువురికి ఎల్వోసీలు అందజేశారు. అయిలాపూర్ గ్రామానికి చెందిన వెల్మ విజయకు రూ.75 వేల విలువైన ఎల్వోసీ, వెల్లుల్ల గ్రామానికి చెందిన జాప అశోక్‌కు రూ.1 లక్ష విలువైన ఎల్వోసీ, ముత్యంపేటకు చెందిన సుద్దాల రాజుకు రూ.75 వేల విలువైన ఎల్వోసీ అందించారు. అలాగే మొగిల్‌పేట గ్రామానికి చెందిన ముక్కెర రాకేష్‌కు రూ.1 లక్ష విలువైన ఎల్వోసీని ఎమ్మెల్యే అందజేశారు. ప్రజలకు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

## ధూళిపాళ్లకి ఓటమి ఖాయం: అంబటి

గుంటూరు,మే 13 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని మామిళ్లపల్లి ఘటన ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. మొక్కజొన్న రైతులపై దాడులు జరిగాయని, అక్రమ కేసులు పెట్టారంటూ వైసీపీ చేపట్టిన 'చలో మామిళ్లపల్లి' కార్యక్రమంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు... ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రపై విరుచుకుపడ్డారు. రైతుల ఇళ్లు, గోడౌన్లపై దాడులు చేయించడం ఏంటని అంబటి ప్రశ్నించారు. ప్రశ్నించే వారిపైనే దాడులు చేస్తారా అంటూ మండిపడ్డారు. "వచ్చే ఎన్నికల్లో ధూళిపాళ్ల నరేంద్ర ఓడిపోవడం ఖాయం, ఇది రాసుకోండి" అంటూ మూడేళ్ల ముందే ఆయన జోస్యం చెప్పారు. రైతుల కాలి ధూళికి ఆయన కొట్టుకుపోతారని వ్యాఖ్యానించారు. మా కుటుంబంపై, మా కులంపై , మా పార్టీపై కక్ష కట్టి ఇలాంటి దాడులు చేస్తున్నారా అని అంబటి నిలదీశారు. గుంటూరు ఐజీ త్రిపాఠి ఖాకీ డ్రెస్ వేసుకోవడం లేదని, పచ్చ డ్రెస్ (టీడీపీ రంగు) వేసుకుంటున్నారని ఆరోపించారు. లోకేశ్, పెమ్మసాని ఏం చెబితే ఐజీ అది చేస్తున్నారని విమర్శించారు. తప్పు చేస్తే ఎంతటి పెద్ద అధికారినైనా చట్టప్రకారం శిక్షిస్తామని, తప్పుడు కేసులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గోడౌన్‌లో సీజ్ చేసిన మొక్కజొన్నను వెంటనే విడుదల చేయాలని కోరారు. అరెస్టులకు భయపడేది లేదని, అవసరమైతే జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.

## అమెరికాలో అటార్నీగా పులివెందుల కుర్రాడు

పులివెందుల, మే 13 (ఈవార్తలు) : కడప జిల్లా పులివెందులకు చెందిన యువకుడు అమెరికాలో అరుదైన ఘనత సాధించారు. టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి కుమారుడు, టీఎన్ఎస్ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయిన భూమిరెడ్డి సాయి శ్రీనివాస్ రెడ్డి, అమెరికాలోని ఇండియానా రాష్ట్రంలో లైసెన్స్‌డ్ అటార్నీ (న్యాయవాది)గా ప్రమాణ స్వీకారం చేశారు. కేవలం 25 ఏళ్ల వయసులోనే, తొలి ప్రయత్నంలోనే ఈ విజయం సాధించి ఆయన తెలుగు సమాజం గర్వపడేలా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, సాయి శ్రీనివాస్ రెడ్డికి ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. "మన టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పులివెందుల వాసి సాయి శ్రీనివాస్ రెడ్డి 25 ఏళ్లకే, తొలి ప్రయత్నంలోనే అమెరికాలో లైసెన్స్ పొందిన న్యాయవాదిగా ప్రమాణం చేయడం యావత్ తెలుగు సమాజానికి గర్వకారణం. భారత్, అమెరికా రెండింటిలోనూ న్యాయవాదిగా లైసెన్స్ పొందిన అతి పిన్న వయస్కుడిగా శ్రీనివాస్ రెడ్డి అరుదైన ఘనత సాధించారు" అని లోకేశ్ తన ట్వీట్‌లో కొనియాడారు. భూమిరెడ్డి సాయి శ్రీనివాస్ రెడ్డి విద్యాభ్యాసం కూడా ఉన్నత స్థాయిలో సాగింది. ఆయన అలయన్స్ యూనివర్సిటీ నుంచి బీబీఏ, ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. ఆ తర్వాత అమెరికాలో మాస్టర్ ఆఫ్ లాస్ (ఎల్ఎల్ఎం) పూర్తిచేశారు. అంతేకాకుండా, ప్రతిష్ఠాత్మక లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో సమ్మర్ ప్రోగ్రామ్స్‌లో కూడా పాల్గొన్నారు. ఇటీవలే ఇండియానా బార్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడంతో భారత్, అమెరికా దేశాల్లో ఏకకాలంలో లీగల్ ప్రాక్టీస్ చేయడానికి అర్హత సాధించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించారు. సాయి శ్రీనివాస్ తండ్రి భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి కూడా విద్యార్థి నాయకుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, జర్నలిస్టుగా పనిచేసి, ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. ప్రస్తుతం ఆయన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజ కవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూనే, కుమారుడు అంతర్జాతీయ స్థాయిలో న్యాయ రంగంలో తనదైన ముద్ర వేయడం విశేషం.

లవ్లీ చిత్రం



మాళవిక శర్మ

# హిందీ డబ్బింగ్‌కు సాయిపల్లవి నో?

సాయి పల్లవి ప్రస్తుతం ప్రతిష్టాత్మక 'రామాయణ' సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. రాముడి పాత్రలో రణబీర్ కపూర్ నటిస్తుండగా, సీత పాత్రలో సాయి పల్లవి నటిస్తోంది. రావణాసురుడి పాత్రలో కన్నడ స్టార్ యశ్ కనిపించబోతున్నాడు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా మొదటి పార్ట్‌ను ఈ ఏడాది దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. హిందీలో రూపొందుతున్న ఈ సినిమాను పలు భాషల్లో డబ్ చేయబోతున్నారు. ముఖ్యంగా హిందీతో పాటు, తమిళ్, తెలుగు, కన్నడం, మలయాళం, మరాఠి, బెంగాలీ భాషల్లో విడుదల చేయడం కోసం డబ్ చేయబోతున్నారనే వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా డబ్బింగ్ విషయమై పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారట. సినిమాలో నటించిన నటీనటులతో డబ్బింగ్ చెప్పించే ఆలోచనతో దర్శకుడు నితేష్ తివారీ ఉన్నారని బాలీవుడ్ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. రాముడి పాత్రలో నటించిన రణబీర్ కపూర్ చేత హిందీలోనే కాకుండా మరో రెండు మూడు భాషల్లోనూ డబ్బింగ్ చెప్పించేందుకు గాను ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయన భాషపై పట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మరో వైపు సాయి పల్లవి సైతం హిందీతో పాటు సౌత్‌లో అన్ని భాషల్లోనూ డబ్బింగ్ చెప్పబోతుందనే వార్తలు వస్తున్నాయి. గతంలో సౌత్ సినిమాలకు సాయి పల్లవి డబ్బింగ్ చెప్పింది. తెలుగు, తమిళ్,



మలయాళ ప్రేక్షకులకు సాయి పల్లవి మాత్రమే కాకుండా ఆమె వాయిస్ పరిచయం. తన పాత్రలకు తగ్గట్లుగా సాయి పల్లవి డబ్బింగ్ చెప్పడం మనం చూశాం. అయితే హిందీలో సాయి పల్లవి డబ్బింగ్ విషయమై విమర్శలు ఎదుర్కొంది. తాజాగా సాయి పల్లవి హిందీలో నటించిన 'ఏక్ దిన్' సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా కోసం సాయి పల్లవి సొంతంగా డబ్బింగ్ చెప్పడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఏక్ దిన్ సినిమాలో సాయి పల్లవి హిందీ డబ్బింగ్ విషయంలో విమర్శలు ఎదుర్కొంది. ముఖ్యంగా హిందీ భాషను ఆమె స్పష్టంగా పలకలేక పోయిందని, కొన్ని పదాలను ఉచ్చరించడంలో చాలా ఇబ్బంది పడ్డట్లుగా అనిపించింది. పైగా ఆమె బాడీ లాంగ్వేజ్‌కి హిందీ భాష సెట్ కావడం లేదని సోషల్ మీడియాలో ట్రోల్స్ వస్తున్నాయి. సాయి పల్లవి ఏక్ దిన్ కోసం సొంతంగా డబ్బింగ్ చెప్పి విమర్శలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రామాయణ విషయంలో ఆలోచన మార్చుకునే అవకాశం ఉందనే వార్తలు వస్తున్నాయి. నితేష్ తివారీ ఇప్పటి వరకు సాయి పల్లవితోనే సీత పాత్రకు డబ్బింగ్ చెప్పించాలని భావించారని, కానీ ఏక్ దిన్ సినిమా తర్వాత ఆయన నిర్ణయంలో మార్పు ఉండే అవకాశం ఉందనే టాక్ సోషల్ మీడియాలో వినిపిస్తోంది.




## ఐబొమ్మ మళ్లీ వచ్చేసింది!

ఐబొమ్మ పేరు వినగానే తెలుగు నిర్మాతలకు గుండె ఆగినంత పనవుతుంది. రిలీజ్ రోజే హెచ్‌డీ ప్రింట్ తో సినిమాలు అప్‌లోడ్ చేసి థియేట్రికల్ రన్ ని దెబ్బకొట్టిన సైట్ అది. చిన్న సినిమాల నుంచి స్టార్ హీరోల మూవీస్ వరకు ఏదీ వదలకుండా ఫ్రీగా పంచేసింది. ఇటీవల ఆ సైట్ ని నడిపిస్తున్నాడనే ఆరోపణలతో రవి అనే వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సైట్‌ని పూర్తిగా మూసేశామని, ఇక ఐబొమ్మ కథ క్లోజ్ అని అధికారికంగా ప్రకటన కూడా వచ్చింది. దాంతో ఇండస్ట్రీ కాస్త ఊపిరి పీల్చుకుంది. పైరసీ భూతం వదిలిందని చిన్న నిర్మాతలు సంబరపడ్డారు. కానీ ఆ ఆనందం రెండు నెలలు కూడా నిలవలేదు. ఎందుకంటే ఇప్పుడు అదే ఐబొమ్మ మళ్లీ ప్రత్యక్షమైంది. కొత్త డొమైన్ తో, కొత్త లుక్‌తో సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. 'మూవీస్ న్యూస్ బప్పమ్ టీవీ' అనే పేరుతో రివ్యూ సైట్ ముసుగు వేసుకున్నా, లోపల మాత్రం పాత పైరసీ కథే నడుస్తోంది. లేటెస్ట్ సినిమాలు కూడా అప్‌లోడ్ అవుతున్నాయనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. అరెస్ట్ అయిన రవి బెయిల్‌పై బయటికి వచ్చి మళ్లీ స్టార్ట్ చేశాడా లేక అతని టీమ్‌లోని వేరే వాళ్లు రీ లాంచ్ చేశారా అనేది ఇంకా క్లారిటీ లేదు.

## ఈసారి అదృష్టం నాదే: చిత్రాంగదా సింగ్

బాలీవుడ్ నటి చిత్రాంగదా సింగ్ పరిచయం అవసరం లేని పేరు. బాలీవుడ్ లో చాలా కాలంగా కొనసాగుతుంది. ట్యాలెంటెడ్ బ్యూటీ. కానీ అమ్మడికి రావాల్సినంత గుర్తింపు ఇంకా రాలేదు. అయినా నటిగా, నర్తకిగా ఏ రోజు ఖాళీగా లేదు. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ కెరీర్ ని ముందకు తీసుకెళ్తోంది. ఈనేపథ్యంలో అమ్మడు ఒక్కసారిగా ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ఓ భారీ పాన్ ఇండియా ప్రాజెక్టులో భాగం కాబోతున్నట్లు హింట్ ఇచ్చింది. గతంలో నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమా ఉరి: ద సర్జికల్ స్ట్రైక్ లో ముఖ్యమైన పాత్ర కోసం తనను అనుకున్నారని కానీ అనివార్య కారణాల వల్ల ఆ సినిమా నుండి తప్పుకోవాల్సి వచ్చిందని ఆమె వెల్లడించారు. ఆ అవకాశం చేజారడం పట్ల అప్పట్లో కొంత బాధ కలిగినా ఈసారి మాత్రం అదృష్టం మళ్లీ తలుపు తట్టిందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. దర్శకుడు ఆదిత్య ధర్‌తో సూఫీ అనే ప్రాజెక్ట్ కోసం ఆమె 2012 సమయంలోనే చర్చలు జరిపారు. ఆ సినిమాలో చిత్రాంగదా కోసం ఆదిత్య అద్భుతమైన పాత్రను రాశారని కానీ దురదృష్టవశాత్తు ఆ సినిమా పట్టాలెక్కలేదని ఆమె గుర్తు చేసుకున్నారు. అప్పట్లో ఆ సినిమా చేసి ఉంటే తన కెరీర్ మరోలా ఉండేదని కానీ కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని అభిప్రాయపడ్డారు.



# వెనక్కి తగ్గిన జాక్వెలిన్


దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సుకేష్ చంద్రశేఖర్ రూ. 200 కోట్ల మనీలాండరింగ్ కేసులో బాలీవుడ్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండేజ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మొదట ఈ కేసులో తాను 'అప్రూవర్' (సాక్షి)గా మారతానని కోర్టు మెట్లెక్కిన ఆమె, ఇప్పుడు అనూహ్యంగా తన పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు. ఇప్పటికే సుకేష్ తనపై వస్తున్న ఆరోపణలను కొట్టిపారేస్తూనే, మరోవైపు జైలు నుంచి జాక్వెలిన్ గురించి లేఖలు రాస్తూ వార్తల్లో నిలుస్తున్నాడు. ఇక ఇప్పుడు ఆమె అప్రూవర్‌గా మారే ప్రయత్నాన్ని విరమించుకోవడంతో, విచారణలో ఎలాంటి కొత్త విషయాలు బయటకు వస్తాయోనని బాలీవుడ్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. కష్టాల్లో ఉన్నప్పుడు దొరికిన దారిలో బయటపడాలని ఎవరైనా చూస్తారు.. జాక్వెలిన్ కూడా అదే ప్రయత్నం చేశారు. కానీ చట్టపరమైన చిక్కులు, ఈడీ అభ్యంతరాల వల్ల ఆమె అడుగు వెనక్కి వేయక తప్పలేదు. ఇక ఏది ఏమైనా రూ. 200 కోట్ల కుంభకోణం కేసులో ఆమె ప్రయాణం ఇంకా ఎన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.





## మా బంధం బలమైనది

బాలీవుడ్ బ్యూటీ, 'నాగిని' ఫేమ్ మౌనీ రాయ్ గత కొద్దిరోజులుగా వార్తల్లో నిలుస్తోంది. ఆమె తన భర్త సూరజ్ నంబియార్‌తో విడిపోతుందనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగింది. ఇన్ స్టాగ్రామ్ నుంచి ఫోటోలు మాయం కావడం, అకౌంట్ కనిపించకపోవడంతో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఈ రూమర్స్ పై మౌనీ రాయ్ ఎట్టకేలకు మౌనం వీడారు. తనదైన శైలిలో స్పందిస్తూ పుకార్లకు చెక్ పెట్టారు. తన వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న తప్పుడు ప్రచారం చూసి మౌనీ రాయ్ సీరియస్ అయ్యారు. "దయచేసి మా బంధం గురించి అసత్యాలు ప్రచారం చేయకండి. మా ప్రైవసీని గౌరవించండి" అంటూ ఆమె మీడియాను, నెటిజన్లను కోరారు.



## పూజాహెగ్డేకు బంపర్ ఆఫర్?

టాలీవుడ్‌లో స్టార్ హీరోల హిట్ కాంబినేషన్స్‌కు ఎప్పుడూ ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. అందులో అల్లు అర్జున్- పూజా హెగ్డే జోడీకి ప్రత్యేక స్థానం ఉందనే చెప్పాలి. గతంలో వీరి కలయికలో వచ్చిన దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురములో సినిమాల్లో ఈ జంట ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ముఖ్యంగా అల వైకుంఠపురములో సినిమా ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన తర్వాత ఈ కాంబోపై అభిమానుల్లో భారీ స్థాయిలో అంచనాలు పెరిగాయి. ఇప్పుడు ఈ జోడీ మూడోసారి కలిసి నటించే అవకాశాలు ఉన్నాయన్న వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తెరకెక్కించనున్న అల్లు అర్జున్ కొత్త సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం పూజా హెగ్డే పేరును పరిశీలిస్తున్నట్లు టాక్ రావడంతో ఈ ప్రాజెక్ట్ ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ దశలో ఉండగా, లోకేష్ కనగరాజ్ స్క్రిప్ట్ ఫైనల్ చేసే పనిలో బిజీగా ఉన్నట్లు సమాచారం. నటీనటులు, టెక్నీషియన్స్ ఎంపిక కూడా వేగంగా జరుగుతోందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ అనే బ్రాండ్‌కు దేశవ్యాప్తంగా ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడింది. యాక్షన్, ఇంటెన్స్ క్యారెక్టరైజేషన్, స్టైలిష్ టేకింగ్‌తో ఆయన సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో మంచి మార్కెట్ సాధిస్తున్నాయి. అలాంటి డైరెక్టర్ సినిమాలో పూజా హెగ్డే నటిస్తే ఆమె పాత్ర ఎలా ఉండబోతుందన్న ఆసక్తి కూడా పెరుగుతోంది.







# కోహ్లీ సూపర్ సెంచరీ

**58 బంతుల్లోనే కింగ్ శతకం.. ఐపీఎల్ కెరీర్‌లో 9వ శతకం**

**కేకేఆర్‌పై ఆర్సీబీ ఘన విజయం.. మళ్లీ టేబుల్ టాపర్‌గా ఆర్సీబీ**

**రాయ్‌పూర్ టీ20లో విరాట్ కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. భారీ స్కోర్ ఛేజింగ్‌లో విరాట్ కోహ్లీ కీలక ఇన్నింగ్స్ ఆడి శతకం బాదాడు. 32 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న కోహ్లీ, 58 బంతుల్లోనే సెంచరీ నమోదు చేసి తన క్లాస్ టచ్ ఏంటో కేకేఆర్ బౌలర్లకు రుచి చూయించాడు.**

**ఓపెనర్‌గా దిగి వికెట్ పడకుండా మ్యాచ్‌ని ఫినిష్ చేశాడు. ఈ విజయంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పాయింట్ల పట్టికలో మళ్లీ టాప్ ప్లేస్‌కి వచ్చేసింది. ఐపీఎల్ 2026లో భాగంగా రాయ్‌పూర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన రజత్ పటిదార్ బౌలింగ్ ఎంచుకుని కోల్‌కతా నైట్ రైడర్స్‌ను బ్యాటింగ్‌కి ఆహ్వానించాడు.**

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| బెంగళూరు | 12 | 8 | 4 | 14 |
| గుజరాత్ | 12 | 8 | 4 | 16 |
| హైదరాబాద్ | 12 | 7 | 5 | 14 |
| పంజాబ్ | 11 | 6 | 4 | 13 |
| చెన్నై | 11 | 6 | 5 | 12 |
| రాజస్థాన్ | 11 | 6 | 5 | 12 |
| ఢిల్లీ | 12 | 5 | 7 | 10 |
| కోల్‌కతా | 11 | 4 | 6 | 9 |
| ముంబై | 11 | 3 | 8 | 6 |
| లక్నో | 11 | 3 | 8 | 6 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓడినవి పా-పాయింట్లు

ఆరంభంలో తడబడిన కేకేఆర్.. ఆ తర్వాత అంగ్‌క్రిష్ రఘువంశీ నిలదొక్కుకోవడంతో భారీ స్కోర్ దిశగా సాగింది. ఆఖర్లో రింకూ సింగ్ రాణించడంతో 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. కేకేఆర్ అందించిన 193 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి విరాట్ కోహ్లీ అదిరిపోయే ఆరంభం ఇచ్చాడు. మరో ఓపెనర్ జేకబ్ బెతెల్ కూడా రాణించడంతో తొలి వికెట్‌కు 3.2 ఓవర్లలో 37 పరుగులు చేశారు. బెతెల్ 12 బంతుల్లో 15 పరుగులు చేసి అవుటయ్యాడు. దేవదత్ పడిక్కల్ క్రీజులోకి వచ్చిన తర్వాత స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. విరాట్ కోహ్లీ - దేవదత్ పడిక్కల్ కేకేఆర్ బౌలర్లను ఒక ఆట ఆడుకున్నారు. పడిక్కల్ తన ఇన్నింగ్స్‌లో ఒక్క సిక్సర్ కూడా నమోదు చేయలేదు కానీ ఏడు బౌండరీలు బాదాడు. కోహ్లీ - పడిక్కల్ కలిసి రెండో వికెట్‌కు 59 బంతుల్లో 92 పరుగులు నమోదు చేశారు. 27 బంతులు ఆడిన పడిక్కల్ ఏడు ఫోర్లతో 39 పరుగులు చేసి అవుటయ్యాడు. కెప్టెన్ రజత్ పటిదార్ 8 బంతుల్లో 11 పరుగులు చేసి వికెట్ కోల్పోయాడు. టిమ్ డేవిడ్ కూడా 3 బంతుల్లో రెండు పరుగులు చేసి ఇలా వచ్చి అలా అవుటయ్యాడు. విరాట్ కోహ్లీని చాలా కాలంగా ఊరిస్తోన్న ఐపీఎల్ సెంచరీ మళ్లీ దక్కింది. 32 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న కోహ్లీ 58 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 2024లో చివరిసారిగా ఐపీఎల్ సెంచరీ చేసిన కోహ్లీ.. మళ్లీ ఈ ఏడాది శతకం బాదాడు. ఓవరాల్‌గా ఐపీఎల్‌లో కోహ్లీ తన 9వ సెంచరీ నమోదు చేసుకున్నాడు. కోహ్లీ 60 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 105 పరుగులతో నాటౌట్‌గా నిలవడంతో ఆర్సీబీ ఓవర్లలో 193 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది.

## కోహ్లీ హవా

ఆడకున్నా ధోనీ మ్యాజిక్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ చివరి దశకు చేరుకోవడంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. ప్లేఆఫ్స్ రేసు మరింత ఆసక్తికరంగా మారడంతో ప్రతి మ్యాచ్ నాకౌట్ తరహాలో సాగుతోంది. మైదానంలో ఆటగాళ్లు సిక్సర్లు, ఫోర్లతో అలరిస్తుంటే.. సోషల్ మీడియాలో అభిమానుల మధ్య ఫ్యాన్ వార్స్ కూడా అదే స్థాయిలో హీట్ పెంచుతున్నాయి. ప్రస్తుతం గుజరాత్ జెయింట్స్ 16 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఆర్సీబీ, ఎస్ఆర్‌హెచ్ జట్లు 14 పాయింట్లతో ప్లేఆఫ్స్ బెర్త్ కోసం పోటీ పడుతున్నాయి. మరోవైపు పంజాబ్ కింగ్స్ కూడా 13 పాయింట్లతో గట్టి పోటీ ఇస్తోంది. ఇలాంటి ఉత్కంఠభరిత సమయంలో స్టార్ స్పోర్ట్స్ విడుదల చేసిన తాజా సోషల్ మీడియా డేటా ఆసక్తికర చర్చకు దారితీసింది. మార్చి 28 నుంచి మే 12 వరకు దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో ఎక్కువగా చర్చించబడిన ఆటగాళ్ల జాబితాను స్టార్ స్పోర్ట్స్ విశ్లేషించింది. ఇందులో విరాట్ కోహ్లీ 44 శాతం చర్చలతో అగ్రస్థానంలో నిలిచాడు. కోహ్లీ బ్యాటింగ్, మైదానంలో అతని అగ్రెసివ్ ఆటతీరు ఎప్పటిలాగే అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అయితే అందరినీ ఆశ్చర్యపరిచిన విషయం ఏమిటంటే.. ఎంఎస్ ధోని ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోయినా 21 శాతం చర్చలతో రెండో స్థానంలో నిలవడం. టోర్నమెంట్ ప్రారంభానికి ముందే కాలికి గాయమవడంతో ధోనీ ఈ సీజన్‌కు దూరమయ్యాడు. అయినప్పటికీ ఆయనపై అభిమానుల క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. సోషల్ మీడియాలో ఇప్పటికీ ధోనీ గురించే పెద్ద ఎత్తున చర్చ జరుగుతుండటం విశేషం. ఈ జాబితాలో రోహిత్ శర్మ 18 శాతం చర్చలతో మూడో స్థానంలో నిలిచాడు. ఇక సంజూ శాంసన్ 10 శాతం, కేఎల్ రాహుల్ 8 శాతం చర్చలతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇక యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఈ సీజన్‌లో అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఆర్ఆర్ తరఫున ఆడుతున్న అతను కేవలం 36 బంతుల్లోనే సెంచరీ సాధించి రికార్డు సృష్టించాడు. అయినప్పటికీ సీనియర్ స్టార్ ఆటగాళ్ల క్రేజ్ ముందు అతనికి టాప్ లిస్టులో చోటు దక్కలేదు. అయితే భవిష్యత్తులో అతను పెద్ద స్టార్‌గా ఎదగడం ఖాయమని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, ధోనీపై బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. త్వరలో ప్రారంభం కానున్న యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో ధోనీ ఆడితే చూడాలని ఉందని అభిషేక్ తన మనసులో మాట బయటపెట్టాడు. దీంతో ధోనీ అభిమానులు మరోసారి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## లియామ్ డాసన్ రిటైర్మెంట్

ఐపీఎల్ 2026 సీజన్ ఉత్కంఠభరితంగా సాగుతున్న సమయంలో క్రికెట్ ప్రపంచంలో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇంగ్లండ్ స్పిన్ ఆల్‌రౌండర్, సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ స్టార్ ప్లేయర్ లియామ్ డాసన్ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు తక్షణమే రిటైర్మెంట్ ప్రకటిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 36 ఏళ్ల డాసన్ ఇకపై కేవలం వైట్ బాల్ క్రికెట్ (పరిమిత ఓవర్ల ఫార్మాట్) మీద మాత్రమే దృష్టి సారించనున్నాడు. తన రిటైర్మెంట్ గురించి డాసన్ హాంప్‌షైర్ వెబ్‌సైట్‌లో మాట్లాడుతూ.. ఈ నిర్ణయం తీసుకోవడం అంత సులభం కాదని, కానీ తన కెరీర్‌ను పరిమిత ఓవర్ల క్రికెట్‌లో సుదీర్ఘకాలం కొనసాగించేందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నట్లు తెలిపారు.



## సన్‌రైజర్స్ టెన్షన్ వద్దు: కైఫ్

ఐపీఎల్ 2026 సీజన్ ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారింది. తాజాగా సన్‌రైజర్స్‌ను చిత్తు చేసిన గుజరాత్ అనూహ్యంగా పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఆ జట్టు వరుసగా ఐదు మ్యాచుల్లో గెలవడం గమనార్హం. ఇక ఆర్సీబీ, సన్‌రైజర్స్, హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ తర్వాత స్థానాల్లో నిలిచాయి. సీఎస్కే, రాజస్థాన్ కూడా తమ అవకాశాలు కోసం పోటీ పడుతున్నాయి. టాప్-4లో నిలవాలనుకొనే జట్లను మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ హెచ్చరించాడు. అలాగే తొలిసారి అహ్మదాబాద్‌లో ఆడి ఘోర ఓటమిని చవిచూసిన సన్‌రైజర్స్ ఎలాంటి కంగారు పడక్కర్లేదని వ్యాఖ్యానించాడు. 'సీఎస్కేతో చెపాక్ వేదికగా సన్‌రైజర్స్ తలపడనుంది. సొంత మైదానం కావడంతో చెన్నై సూపర్ కింగ్స్‌కు అడ్వాంటేజ్ ఉంటుంది. తప్పకుండా ఎస్ఆర్‌హెచ్‌కు కఠిన సవాల్ ఎదురవుతుంది. అయితే, పరిస్థితులను త్వరగా అలవర్చుకుని ఆడితే పెద్ద కష్టమేం కాదు. గుజరాత్‌తో మ్యాచ్‌లో అదే పొరపాటును సన్‌రైజర్స్ చేసింది. తప్పకుండా దీనిపై వారి డ్రెస్సింగ్ రూమ్‌లో చర్చించుకోవాలి. అలాగని ఈ ఓటమితో కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇక చివరి మ్యాచ్ రాయల్ ఛాలెంజర్స్‌తో హైదరాబాద్‌లో తలపడనుంది. ఈ రెండు మ్యాచులు సన్‌రైజర్స్‌కు అత్యంత క్లిష్టమైనవే. అయితే, టాప్-4 కోసం పోటీపడుతున్న జట్లేవీ సురక్షితంగా ఉన్నాయని అనుకోవద్దు' అని కైఫ్ వెల్లడించాడు.

## సంజూ సింప్లిసిటీ

చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ క్రికెటర్ సంజు శాంసన్ తన నిరాడంబరతతో అభిమానుల మనసులను గెలుచుకున్నాడు. తమిళనాడులోని ఒక బీచ్‌లో సరదాగా క్రికెట్ ఆడుతున్న కొంతమందిని చూశాడు. సంజు కూడా సాధారణ వ్యక్తిలా వారితో జత కలిశాడు. వారు బౌలింగ్ చేస్తుంటే బ్యాటింగ్ చేసి అందరినీ ఆలరించాడు. క్రికెట్ అభిమానులతో సరదాగా గడిపాడు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. నెటిజన్లు సంజు శాంసన్ నిరాడంబరతను ప్రశంసిస్తున్నారు.



## టెస్టుల్లో నం.1 బుమ్రానే

ఐసీసీ బుధవారం టెస్టు ర్యాంకింగ్స్‌ను రిలీజ్ చేసింది. తాజా ర్యాంకింగ్స్‌లోనూ భారత స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా నం.1 స్థానాన్ని కాపాడుకున్నాడు. ఇతర దేశాల స్టార్ బౌలర్ల నుంచి పోటీ ఎదురైనప్పటికీ అతను 879 రేటింగ్ పాయింట్స్‌తో అగ్రస్థానంలోనే ఉన్నాడు. భారత్ తరఫున మహ్మద్ సిరాజ్ సెకండ్ హయ్యెస్ట్ ర్యాంక్ బౌలర్‌గా ఉన్నాడు. అతను 12వ స్థానంలో కొనసాగుతున్నాడు. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ వరుసగా 14వ, 15వ స్థానాల్లో ఉన్నారు. ఆస్ట్రేలియాకు చెందిన మిచెల్ స్టార్క్, న్యూజిలాండ్ పేసర్ హెన్రీ తమ ర్యాంక్‌లను మెరుగుపర్చుకుని 2వ, 3వ ర్యాంక్‌ల్లో నిలువగా ఆసిస్ కెప్టెన్ కమిన్స్ 4వ స్థానంలో ఉన్నాడు. బ్యాటింగ్ విభాగంలో ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ నం.1 బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. భారత్ నుంచి యశస్వి జైశ్వాల్, శుభ్‌మన్ గిల్ టాప్-10లోనే ఉన్నారు. జైశ్వాల్ 8వ స్థానంలో కొనసాగుతుండగా.. గిల్ 9వ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. టీమిండియా టెస్టులు ఆడి ఆరు నెలలకుపైనే అవుతుంది. ఈ ఏడాది ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. చివరిసారిగా నవంబర్‌లో సౌతాఫ్రికాతో తలపడింది. అయినప్పటికీ భారత ఆటగాళ్లు తమ ర్యాంక్‌లను నిలబెట్టుకోవడం విశేషం. భారత జట్టు జూన్‌లో అఫ్గానిస్తాన్‌తో ఏకైక టెస్టు ఆడనుంది. అనంతరం వన్డే వరల్డ్ కప్-2027 కోసం వైట్‌బాల్ క్రికెట్‌పై దృష్టి పెట్టనుంది.



## కమ్మిన్స్‌కు 12 లక్షల ఫైన్

ఐపీఎల్‌లో మంగళవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్ జట్టు 82 రన్స్ తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది.అయితే ఆ మ్యాచ్‌లో హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్‌కు జరిమానా పడింది. స్లో ఓవర్ రేటు కారణంగా అతనికి ఫైన్ విధించారు. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ అతనికి 12 లక్షల జరిమానా విధించింది. వాస్తవానికి ఈ మ్యాచ్ కేవలం 34.5 ఓవర్లలోనే ముగిసింది. అయినా కానీ కమ్మిన్స్‌కు జరిమాన విధించాల్సి వచ్చింది. ఫస్ట్ బౌలింగ్ చేసిన హైదరాబాద్.. చాలా నెమ్మదిగా బౌలింగ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ జట్టుకు ఇదే తొలి ఉల్లంఘనగా ఐపీఎల్ పేర్కొన్నది. ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం కమ్మిన్స్ ఫైన్ వేస్తున్నట్లు ఐపీఎల్ తన రిలీజ్‌లో చెప్పింది. 169 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు కేవలం 86 పరుగులకే ఆలౌటైంది. జీటీ పేస్ బౌలర్లు ఈ మ్యాచ్‌లో చెలరేగిపోయారు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# విద్యావ్యవస్థలో లోపాలు

దేశంలో గత కొన్నేళ్లుగా నిరంతరం పునరావృతమవుతున్న ప్రశ్నపత్రాల లీకేజీల వ్యవహారం మిలియన్ల మంది నిరుద్యోగ యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తోంది. పోటీ పరీక్షలకు సిద్ధమవడానికి విద్యార్థులు తమ రక్తాన్ని, చెమటను ధారపోస్తుంటే, లీకేజీ మాఫియా మాత్రం వారి శ్రమను క్షణాల్లో బూడిదలో పోసిన పన్నీరుగా మారుస్తోంది. ఈ వ్యవస్థాగత వైఫల్యంలో పాలకుల, ప్రభుత్వాల అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తుండటం తీవ్ర ఆందోళనకరం. ఆధునిక యుగంలోనూ భద్రతా ప్రమాణాలు పాటించడంలో పరీక్షా బోర్డులు విఫలమవుతున్నాయి. ప్రశ్నపత్రాల రూపకల్పన నుండి పంపిణీ వరకు ప్రతి దశలోనూ నిఘా లోపిస్తోంది. లీకేజీ జరిగినప్పుడు తక్షణమే కఠిన చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయి. నిరుద్యోగుల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలకే పాలకులు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వ విభాగాల్లోని కొందరు అవినీతి అధికారుల అండతోనే లీకేజీ మాఫియా రెచ్చిపోతోంది. నిందితులకు త్వరితగతిన శిక్షలు పడకపోవడంతో నేరగాళ్లకు భయం లేకుండా పోయింది. లీకేజీల వల్ల పరీక్షలు రద్దయి, మళ్లీ నిర్వహించేసరికి అభ్యర్థుల వయోపరిమితి దాటిపోతోంది. నిరుద్యోగ కుటుంబాలపై కోచింగ్ ఫీజులు, దరఖాస్తు రుసుముల భారం రెట్టింపవుతోంది. కేవలం కొత్త చట్టాలు తెస్తే సరిపోదు; వాటిని అమలు చేసే పటిష్టమైన రాజకీయ సంకల్పం ప్రభుత్వాలకు ఉండాలి. పరీక్షల నిర్వహణ సంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడుతూ, అత్యాధునిక ఎన్‌క్రిప్షన్ సాంకేతికతను ఉపయోగించాలి. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సరే, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన కఠినంగా శిక్షించాలి. యువత నిరాశ నిస్పృహల్లోకి జారుకోకముందే ప్రభుత్వాలు తమ అలసత్వాన్ని వీడి, పారదర్శకమైన పరీక్షా విధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# ఏం మనుషులు?

ఏం మనుషులు వీరివి ఏం మనసులు
చెడ్డ పనులు చేసేటి దొడ్డ మనుషులు
వీరు ఎంత చెప్పినా అసలు వినరు
వారు ఏమాత్రం సిసలైన దారిని కనరు !

ఏం మనుషులు వీరివి ఏం మనసులు
తెగ కోతలు కోసేటి ఈ కోతి మనుషులు
కొంపకు నిప్పు పెట్టి చుట్టలు ముట్టిస్తరు
చంపకు చుక్కెట్టి జేబులు కొట్టేస్తరు !


ఏం మనుషులు వీరివి ఏం మనసులు
ఓట్ల సీట్లకై పోటీ చేయు పోకిరి మనుషులు
నెట్ల గట్ల గుండా నోట్లు పంచుతుంటరు
గెలిచిన పిమ్మట వారు కోట్లు దండుకుంటరు !

ఏం మనుషులు వీరివి ఏం మనసులు
లాయర్లైన కొందరు లయైరు మనుషులు
కోర్టులో అన్యాయానికి హాజరు వేస్తుంటరు
రికార్డుగా న్యాయంకై గైర్హాజరు మోస్తుంటరు !

ఏం మనుషులు వీరివి ఏం మనసులు
రౌడీలైనా కొందరు దౌర్జన్యం మనుషులు
మానవత్వాన్ని మంట కలుపుతున్నరు
దానవత్వాన్ని వారు ఇంట నిలుపుతున్నరు !



గుర్రాల లక్ష్మారెడ్డి
కవి, రచయిత
సెల్ 9491387977
కల్వకుర్తి, నాగర్ కర్నూల్ జిల్లా, తెలంగాణ



# కోదండరాంకు విద్యాశాఖ ఇవ్వాలి

**అనేక వివాదాల అనంతరం ఇటీవలే గవర్నర్ కోట నామినేటెడ్ ఎమ్మెల్సీగా ఎన్నికైన తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ప్రమాణ స్వీకారణ అనంతరం మండలి ఆవరణంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ తాను ప్రొఫెసర్ జయశంకర్ సార్ కి ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ అభివృద్ధి కోసం నిబద్ధతతో ప్రజల పక్షాన నిలబడి పని చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా మరుసటి రోజు టీజేఎస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ సందర్భంగా ఏప్రిల్ 29న మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని మంత్రి పదవి అడగలేదని, అటువంటి హామీ ఏమి తమ మధ్య లేదని ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడడం తెలిసిన విషయమే. కానీ తెలంగాణ జన సమితి అధినేతగా ప్రొఫెసర్ కోదండరాం తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకోవడం అనేది వ్యక్తిగతంగా ప్రొఫెసర్ కోదండరాం కంటే కాంగ్రెస్ పార్టీకే ఎక్కువ అవసరం అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకే ప్రయోజనం కూడా అని గ్రహించవచ్చు.**



కడారి రమేశ్ యాదవ్
7893285131

రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమ సమయంలో అనుకున్నట్టుగా ఊహించుకున్నట్టుగా రాష్ట్రం ఏర్పడితే తెలంగాణలో విద్యావ్యవస్థ సమూలంగా ఉన్నతీకరించబడి ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతమై, తద్వారా తెలంగాణ బలహీనవర్గాల భవిష్యత్ బాగుపడుతుందనుకుంటే దానికి భిన్నంగా తెలంగాణ విద్యా వ్యవస్థ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కంటే కూడా అధోగతి పాలైన సందర్భం మనం గ్రహించవచ్చు. తెలంగాణను సాధించిన వారిలో ప్రధాన భాగస్వామ్యలు ముందు వరసలో ఉన్నవారు విద్యార్థులు, అటువంటి విద్యార్థులు పోరాడి సాధించిన తెలంగాణలో విద్యావ్యవస్థ ప్రపంచ స్థాయిని అందుకుంటుందనుకుంటే, అందుకు విరుద్ధంగా విద్యార్థులపై, విద్యావ్యవస్థపై పొగ పట్టిన కేసీఆర్ గత పదేండ్ల ప్రభుత్వంలో, ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాల స్థాయి వరకు విద్యా వ్యవస్థపై కనీస సమీక్ష నిర్వహించకుండా, పాఠశాల ఉపాధ్యాయుల నుంచి యూనివర్సిటీ ఆచార్యుల వరకు నియమకాలు చేపట్టకుండా విద్యావ్యవస్థలో రిటర్మెంట్లే తప్ప పునర్ నియమకాలు ఎరుగని గత పది ఏళ్ల పాలనలో మనం విధ్వంసం తప్ప విద్యావ్యవస్థలో వికాసం కనిపించని ధ్వంస రచనను తెలంగాణ సదువుల తల్లి ఒక్క ఉస్మానియా యూనివర్సిటీని చూస్తే మనం అర్థం చేసుకోవచ్చు. ఉద్యమ కాలంలో తెలంగాణ వస్తే ఉస్మానియాను ఆక్స్‌ఫర్డ్ హార్వర్డ్ విశ్వవిద్యాలయాల స్థాయిలో అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాటకు పూర్తి విరుద్ధంగా మొత్తం ఉస్మానియా యూనివర్సిటీనే నిర్వీర్యం చేయాలనే కుట్రలను మనం చూసినం. అటువంటి సందర్భంలో పదేళ్ల పాలన తర్వాత అదే విద్యార్థి, నిరుద్యోగ లోకమంతా మరొకసారి ఏకమై నిరంకుశత్వ, విద్యార్థి నిరుద్యోగ వ్యతిరేక విధ్వంసకర ఫామ్హౌస్ పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపాలనను ఏర్పాటు చేసుకున్న సందర్భం మనకు తెలిసిందే. అదే సందర్భంలో జేఏసీగా తెలంగాణ ఉద్యమాన్ని, నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను మిలియన్ మార్చ్, సాగరహారం, సకలజనుల సమ్మె వంటి ప్రపంచ దృష్టిని ఆకర్షించిన మహత్తర కార్యక్రమాలతో మలిదశ తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువుగా నిలిచిన విద్యావంతులు, మేధావి, తెలంగాణ జన సమితి అధినేత ప్రొఫెసర్ కోదండరామ్ కేసీఆర్ దుష్ట పాలనను పారదోలుటలో జూపల్లి, పొంగులేటి వంటి నాయకులను కాంగ్రెస్ నీడలోకి తిసుకోచ్చి, రాజకీయ ఐక్యతను ఏర్పరచి, మహాకూటమిలో భాగంగా 2018లో జరిగినట్లు ఓట్ల చీలికను నివారించడం కోసం మరోసారి అటువంటిది పునరావృతం కాకుండా తన సొంత పార్టీ అయిన టీజేఎస్ ను సైతం పొత్తు ధర్మంలో భాగంగా పోటీకి దూరంగా ఉంచి ప్రజా పాలన ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించిన కోదండరామ్ గారికి తెలంగాణ విద్యాశాఖ మంత్రిగా అవకాశం కల్పించి, గాడి తప్పిన తెలంగాణ విద్యా వ్యవస్థను, ప్రజా ప్రభుత్వంలో, ఉద్యమ సేనాని కోదండరాం గారి ఆధ్వర్యంలో చక్కదిద్దాల్సిన అవసరం ఉందని యవత్ తెలంగాణ సమాజం ఆశిస్తుంది. కాబట్టి కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో సకల జన సేనాని, తెలంగాణ ఉద్యమ సూర్యుడు ప్రొఫెసర్ కోదండరామ్ గారిని మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా వారి వ్యక్తిగత ప్రతిష్ట పెంచేది కొత్తగా ఏం ఉండదు, కానీ తెలంగాణ విద్యా శాఖ మంత్రిగా అవకాశం కల్పించడం ద్వారా సమాజానికి మేలు కావడంతో పాటు రాజకీయంగాను కాంగ్రెస్ పార్టీకి ఎంతో అవసరమని మనం గ్రహించాలి.ఎందుకంటే కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం ఆ పార్టీకి తెలంగాణ సమాజం నుండి వ్యతిరేకత ఏర్పడినప్పుడు గాని ఇవ్వండి, రాజకీయ అనానుకుల పరిస్థితిలు ఏర్పడినప్పుడల్లా, మొత్తంగా బిఆర్ఎస్ కు ప్రతికూల పరిస్థితులు ఏర్పడినప్పుడల్లా వాళ్ళు ఎత్తుకునే మొదటి రాగం, చివరి రాగం తెలంగాణ ఉద్యమ గుర్తులను జ్ఞాప్తి చేసుకోవడం, లేదా ఉద్యమ జ్ఞాపకాలను నేమరేసుకోవడం, తెలంగాణ సెంటిమెంటును రగిలించడం, అంతిమంగా తెలంగాణ ఉద్యమ కాలంనాటి భావోద్వేగ పరిస్థితులను రగిలించి మరోసారి తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా వాడుకోవాలని చూడడం కేసీఆర్ కు, బీఆర్ఎస్ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అనేది జగమెరిగిన సత్యం. అటువంటి సందర్భాల్లో కేసీఆర్ కు సమాన స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో, ఉద్యమ నాయకులు ప్రస్తుత ప్రభుత్వంలో కొంతమంది నాయకులు ఉన్నప్పటికీ తెలంగాణ సభ్య సమాజం పార్టీలకు అతీతంగా గౌరవించుకునే ప్రొఫెసర్ కోదండరాం కాంగ్రెస్ క్యాబినెట్లో ఉండడం ద్వారా కేసీఆర్ కు సమానమైన ఉద్యమ నాయకున్ని కాంగ్రెస్ చూపెట్టి అసెంబ్లీ లోపల గాని, బయట గానివ్వండి కేసీఆర్ ను ఉద్యమ కోణంలో ఎదుర్కోవడానికి కోదండరామ అనే వ్యక్తిని ఆయుధంగా ఉపయోగించుకోవడానికి కూడా కాంగ్రెస్ కు, ఒక విష్ణుచక్రం వలే, రామబాణం వలె ఉపయోగపడతారంటే అతిశయోక్తి కాదు. కాబట్టి తెలంగాణ జన సమితి అధినేతను కాంగ్రెస్ పార్టీ తమ క్యాబినెట్ లోకి తీసుకోవడం ద్వారా తెలంగాణ సమాజానికి, తెలంగాణ విద్యా వ్యవస్థ పునర్నిర్మాణానికి, అంతిమంగా కాంగ్రెస్ పార్టీకి ఉపయోగకరం కాబట్టి గౌరవనీయులైన గౌరవ పెద్దలు కోదండరాం గారిని, పెద్దల సభకు పంపించినట్టుగానే, రాష్ట్ర క్యాబినెట్ లోకి తీసుకోవాలని యావత్ తెలంగాణ ప్రజానికం తరుపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాం.

వ్యాసకర్త: ఎంఏ, ఎల్ఎల్‌బీ,
ఓయూ జేఏసీ చైర్మన్, విద్యార్థి నాయకుడు

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.